అవనిపై హరివిల్లు

- అలరించిన ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- నంద్యాల టెక్కె మార్కెట్ ముగ్గుల మయం
- రాయలసీమ సంస్కృతి భిన్నమైనవి
- బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



ముగ్గు వేస్తున్న మహిళలు



ముగ్గులు వేస్తున్న యువతి

అవని.. అందాల ముత్యాల ముగ్గులతో మురిసింది. రంగురంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు వయసు తారతమ్యాలను మరచి పోటీపడగా.. చూపరుల మది పులకించింది. తెలుగు లోగిళ్లలో సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా చేసుకునే అచ్చతెలుగు పండుగ సంక్రాంతి. ఈ పండుగను పురస్కరించి ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో ముత్యాల ముగ్గుల పోటీల సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు చిట్టి చేతులతో రంగవల్లులు వేస్తుంటే... మహిళలు కొంగు బిగించి అందాల హరివిల్లులను తీర్చిదిద్దారు. నానాటికీ కనుమరుగవుతున్న సంస్కృతీ సంప్రదాయాలను ప్రస్తుత తరానికి తెలిపే విధంగా తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రంగు రంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి ముందే వచ్చిందా అనేలా సందడి నెలకొంది. మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులతో రంగుల హరివిల్లు రూపుదిద్దుకొంది. నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో జరిగిన పోటీలకు మహిళలు ఉత్సాహంగా తరలి వచ్చారు. మహిళలు వేసిన రంగుల ముగ్గులు కనువిందు చేశాయి.

- నంద్యాల కల్చరల్ (ఆంధ్రజ్యోతి)



ముగ్గును పరిశీలిస్తున్న అతిథులు

వివరాలు 6లో..

నేడు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

కర్నూలు కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో ఆదివారం (నేడు) ఉదయం 10 గంటలకు కర్నూలు నగరంతో పాటు, ఆదోని పట్టణాల్లో జరుగనున్నాయి. ముఖ్య అతిథులుగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, కలెక్టర్ రంజిత్‌బాషా హాజరు కానున్నారు. కర్నూలు సిటీ ఏ క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్ (కలెక్టరేట్ వెనుక) మైదానంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. విజేతలకు ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3వేలు అందజేస్తారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి ఉంటుంది. అదేవిధంగా ఆదోని పట్టణంలోని మిల్టన్ గ్రామర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మైదానంలో ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ముగ్గురికి ప్రాణం పోసిన రైతు

- బ్రెయిన్ డెడ్‌కు గురైన పెద్దయ్య
- లివర్, రెండు కిడ్నీలు దానం చేసిన కుటుంబ సభ్యులు



పెద్దయ్య (ఫైల్)

కర్నూలు హాస్పిటల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్‌కు గురైన రైతు ముగ్గురికి ప్రాణం పోశారు. ఆయన లివర్, రెండు కిడ్నీలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి పెద్ద మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. వివరాలివీ.. కర్నూలు జిల్లా కల్లూరు మండలం దొడ్డిపాడు గ్రామానికి చెందిన రైతు పెద్దయ్య (59)కు ఈ నెల 2వ తేదీన ఇంట్లో ఉన్న సమయంలో తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దీంతో ఆయనను కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రోగిని పరిశీలించిన వైద్యులు తలలో బ్లడ్ క్లాట్ అయినట్లు గుర్తించి రెండు రోజులుగా వైద్యం అందించారు. అయితే శనివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. అవయవదానంపై ఏపీ జీవన్‌ధాన్ సమన్వయకర్త డా.రాంబాబు బృందం రైతు కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించారు. దీంతో పెద్దయ్య భార్య కుమారుల అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. ఒక కిడ్నీని కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు, మరో కిడ్నీని నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌కు, లివర్‌ను విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌కు ఇచ్చారు. ఏపీ జీవన్‌ధాన్ కోఆర్డినేటర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను తరలించారు.



అవయవాలను తరలిస్తున్న వైద్య సిబ్బంది

475 కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న 1,48,149 మంది విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తూ ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కార్యక్రమాన్ని విజయానంద్, కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్లను, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.86 కోట్లను ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం ఖర్చు చేయనుందని అన్నారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఈ పథకానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కళాశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా మేధాశక్తి, శారీరక బలంతోపాటు మానసిక వికాసం కలిగే అవకాశం ఉందన్నారు. కర్నూలు జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 8,679 మంది విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందనున్నారని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో ఒకే రకమైన మెనూ కాకుండా రోజుకోవిధంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. దేశం, రాష్ట్రం గర్వించేలా మంచి పౌరులుగా, మేధావులుగా అన్ని రంగాల్లో విశేష ప్రతిభ చూపించి కళాశాలలకు మంచి పేరు తీసుకు రావాలని విజయానంద్ విద్యార్థులను ఆశీర్వదించారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకం ద్వారా మరింత పురోగతి సాధిస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకం కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కలెక్టర్ రంజిత్ బాషా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్, డీఎస్పీ మహబూబ్ బాషా, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కల్లూరుల తహసీల్దార్ ఆంజనేయులు, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్స్ సరళాదేవి, నాగస్వామి నాయక్, డీఈవో ఏడీ-1 ఏ.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న విజయానంద్, కలెక్టర్ రంజిత్ బాషా

రేపు తుది ఓటరు జాబితా ప్రచురణ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నిక సంఘం జారీ చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్-2025లో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల యొక్క తుది ఓటర్ల జాబితా అన్ని పోలింగ్ కేంద్రాల్లో, తహసీల్దార్ కార్యాలయం ఎన్నికల నమోదు అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రచురించబడుతుందని ఎన్నికల అధికారి కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. కావు. ప్రజలందరూ తమ వివరాలను తుది ఓటర్ల జాబితాలో పరిశీలించుకోవాలని సూచించారు.

రేషన్ డీలర్ల ఎంపికకు నేడు రాత పరీక్ష

హాల్ టికెట్, ఆధార్ కార్డు ఉంటేనే లోపలికి అనుమతి

కర్నూలు రూరల్ జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రెవెన్యూ డివిజనల్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న రేషన్‌డీలర్ల అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. కర్నూలు రెవెన్యూ డివిజన్ కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఓర్వకల్లు, కల్లూరు, కోడుమూరు, గూడూరు, బెలగల్, వెల్దుర్తి మండలాల పరిధిలో ఉన్న రేషన్‌డీలర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కర్నూలులోని ఎ.క్యాంపులో ఉన్న ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాలలో రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొత్తం 8 మండలాల్లో 74 ఖాళీ రేషన్ దుకాణాలకు గాను 875 దరఖాస్తులు వచ్చినట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రాత పరీక్షలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం కల్లా ఆయా మండల తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నోటీసు బోర్డులో ఎంపికైన అభ్యర్థుల ఫలితాలకు సంబంధించిన తుది జాబితాను ఉంచుతామని ఏఎస్ఓ తెలిపారు. ఇప్పటికే అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేశామని, పరీక్షలు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా వారి హాల్ టికెట్‌తోపాటు, ఒరిజనల్ ఆధార్‌కార్డును వెంట తీసుకవస్తేనే లోపలకు అనుమతి ఇస్తామని ఆయన సూచించారు.

రూ.20 కోట్ల భూమిని కాజేశారు..!

బతికున్న వ్యక్తి చనిపోయినట్లుగా మరణ ధ్రువీకరణ పత్రం సృష్టి

ఆపై అధికారుల సంతకాల ఫోర్జరీ చేసి వేరొకరికి రిజిస్ట్రేషన్ 7


పింఛన్ల వెరిఫికేషన్ చేపట్టాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో హెల్త్ డిజేబుల్ పింఛన్లను వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం హెల్త్ డిజేబుల్డ్ పెన్షన్ల వెరిఫికేషన్ అంశంపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి హెల్త్ డిజేబుల్డ్ పింఛన్లను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టిందన్నారు. సోమవారం నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని తెలిపారు. జిల్లాలో 413 మంది హెల్త్ డిజేబుల్డ్ పింఛన్లు పొందుతున్నారు. జిల్లాలో వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు మూడు మెడికల్ బృందాలను నియమించామన్నారు. చేశామన్నారు. ఈ బృందాలు 413 మంది పింఛన్‌దారుల ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు రూట్ మ్యాప్‌లను రూపొందించి, వెరిఫికేషన్ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీములతో సమన్వయం చేసుకుని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఈ ప్రక్రియను చేపట్టాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, జడ్పీసీఈవో, జిల్లా స్థాయి సమన్వయ కమిటీ మెంబర్ కన్వీనరైన డీఆర్డీఏ పీడీని ఇతర సభ్యులను ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ పీడీ నాగ శివలీల, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డీఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు పదోన్నతుల ప్రక్రియ పూర్తి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ శాఖలోని ఖాళీలు ఉన్న 50 సీనియర్ అసిస్టెంట్లు, 100 గ్రేడ్-1 వీఆర్వో పోస్టుల పదోన్నతుల ప్రక్రియ జనవరిలోపు రెవెన్యూ అధికారులు భర్తీ చేయనున్నారు. శనివారం సీనియర్ అసిస్టెంట్లు పదోన్నతుల జాబితాలో ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-1 వీఆర్వోల సర్వీస్ పుస్తకాన్ని రెవెన్యూ అధికారులు వెరిఫికేషన్ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో గ్రేడ్-1 వీఆర్వో పోస్టులకు అర్హత కలిగిన గ్రేడ్-2 వీఆర్వోల సీనియర్ అసిస్టెంట్ల జాబితా ప్రకటించనున్నారు.

తుంగభద్ర తీరం సాహిత్యం



కవులకు, పాఠకులకు మార్గదర్శి

కవి, కథకుడు అయిన కెంగార మోహన్ తాజాగా కవిత్వ విమర్శ పుస్తకం విడుదల చేశారు. ఉపాధ్యాయుడిగా పని చేసే మోహన్ సాహితీ స్రవంతి అనే సుప్రసిద్ధ సంస్థకు రాష్ట్ర అధ్యక్షుడు. గత ఇరవై ఏళ్లుగా సాహిత్య ఉద్యమంలో ఉన్న మోహన్ అనేక పుస్తకాలు రాశారు. ఆ వరుసలో చెమట చెక్కిన వాక్యం అనే విమర్శ గ్రంథం తీసుకొచ్చారు. ఇందులో ఆయన ప్రముఖ కవుల కవితా సంపుటాల దగ్గరి నుంచి ఇటీవలే తొలి కవిత్వ సంపుటి విడుదల చేసిన కవి దాకా పరిగణలోకి తీసుకున్నారు.

ఈ పుస్తకంలో ఆయన ఆధునిక తెలుగు సాహిత్యంలో భిన్న ధోరణులను, ఉద్యమాలకు చెదిన కవిత్వాన్ని పరామర్శించారు. ఒక కవి కవిత్వాన్ని ఎట్లా నిర్మించిందీ, ఏ దృక్పథంలో కవిత్వం రాసిందీ చాలా శ్రద్ధగా పరిశీలించి వివరించే ప్రయత్నం చేశారు. ఒక భావన, అనుభూతి ఎట్లా కవిత్వ రూపం ధరించేదీ వివరించడం వల్ల ఈ పుస్తకంలోని చాలా వ్యాసాలు అటు కవులకేగాక, కవిత్వ పాఠకులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది. కవిత్వాన్ని ఎట్లా చదవాలి? కవిత్వంలోని అర్థాలను ఎట్లా గ్రహించాలి? కవిత్వాన్ని ఎట్లా అనుభూతి చెందాలి? అనేవి కవిత్వ పఠనంలో ముఖ్యమైన అంశాలు. ఇవి తెలియకపోతే పాఠకులు కవిత్వానికి చేరుకవ కాలేరు. విమర్శకులు చాలా వరకు ఈ పని చేసి పాఠకులకు, కవిత్వానికి దూరం తగ్గిస్తుంటారు. కవిత్వాన్ని విప్పిచెప్పడమేగాక కవిత్వాన్ని సొంతంగా అనుభూతిమయం చెందగల సాధారణ మార్గాన్ని సూచిస్తూ ఉంటారు.

కెంగార మోహన్ రాసిన ఈ పుస్తకంలోని వ్యాసాలు చదివినప్పుడు పాఠకులకు ఇలాంటి దారి దొరుకుతుంది. తద్వారా కవిత్వమంటే అర్థంకాని మార్మిక ప్రపంచం అనే అపోహ నుంచి పాఠకులు బైటపడతారు. కవిత్వాన్ని తమ స్వీయానుభవంలో భాగం చేసుకుంటారు. చాలా సరళమైన వాక్యాలతో, తేలిక పద్ధతిలో మోహన్ తన విశ్లేషణ రచన చేశారు. సాహిత్య విమర్శలోని పరామర్శ పరిచయం దగ్గర మొదలయ్యే ఈ వ్యాసాల్లో కొన్ని చోట్ల మంచి విశ్లేషణ కూడా ఉంది. కవిత్వంలోని వస్తువు, శిల్పం, దృక్పథం మూడింటినీ మోహన్ దృష్టిలో పెట్టుకొని ఈ పరిచయ వ్యాసాలు రాశారు. అయితే ప్రధానంగా వస్తువు, దృక్పథం, ప్రయోజనం మీద నొక్కు ఉంటుంది. ప్రగతిశీల కవిగా, పాఠకుల కేంద్రంగా తన విమర్శ ఉండాలనే లక్ష్యం పెట్టుకున్నందు వల్ల ఆయన ఈ పద్ధతి పాటించారు.

విమర్శకులతోపాటు, పాఠకులు సమాదరించగల ఈ విమర్శ వ్యాస సంపుటి కర్నూలు జిల్లా సాహిత్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

కాలచక్రం



నవచేతన సమ భావన
వెల్లివిరియగా
సప్తస్వర సరిగమలే ఆలపించుదాం
చిరునగవులు పలకరింపు
ఆలంబనగా
కపటపు నటనల ముసుగును
తొలగించుదాం
మానవతా పరిమళాలు వెదజల్లేలా
మనసున మాలిన్యాలను ప్రక్షాళన
చేద్దాం

గుప్పిట చిక్కక కాలము పరుగులు
పెడుతూ
గుప్పెడు గుండెలో గురుతులు ముద్రణ
వేస్తూ
జ్ఞాపకాల ముత్యములను
దోసిట పోస్తూ
పన్నీటిని కన్నీటిని సమముగా
పంచి ఇస్తూ
జీవితమనే వైకుంఠపాళి
ఆటలో
అందలాలు ఎక్కించే నిచ్చెనలు
అధో పాతాళానికి తోసేసే నాగుల
పరీక్షలు
అనంతమైన కాలచక్ర పయనంలో
నా తుది మజిలీ ఏ క్షణమో ఎవరికి
ఎరుక
నిట్టూరుప్పల నిరాశలే గతమునకు
వదిలి
ఆశయాల శ్వాసతో భవితను తలచి
ఊపిరి ఉన్నంతలోనే
సాధన చేసీ
జీవన పరమార్థాన్ని
సాధించుదాం



-డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కవయిత్రి, కర్నూలు



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం'** శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.

ఆంధ్ర అబ్బాయి.. జపాన్ అమ్మాయి

- ఒక్కటైన కీర్తికుమార్, మట్ సుమోటొ రింక జంట
- కర్నూలు చర్చిలో తల్లిదండ్రుల సమక్షంలో వివాహం



తల్లిదండ్రులతో వధూవరులు కొరకోల కీర్తికుమార్, మట్ సుమోటొ రింక

కర్నూలు కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అబ్బాయి.. జపాన్ అమ్మాయి పెళ్లితో ఒక్కటయ్యారు. కర్నూలు నగరంలో చిన్నపార్కు సమీపంలోని సీఎస్ఐ చర్చి ఇందుకు వేదికగా నిలిచింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, చర్చి పెద్దల సమక్షంలో వారి వివాహం ఘనంగా జరిగింది. కర్నూలుకు చెందిన కొరకోల కీర్తికుమార్ ముంబై ఐఐటీ నుంచి ఇంజనీరింగ్ పూర్తి ఉద్యోగ రీత్యా జపాన్‌కు వెళ్లారు. అక్కడ టోక్యో సిటీలో ఉద్యోగం చేస్తుండగా, ఆయన టీమ్‌లో ఒకరుగా పనిచేస్తున్న మట్ సుమోటొ రింకతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. నాలుగేళ్ల నుంచి ప్రేమించుకుంటున్న వీరిద్దరూ ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు.

వివాహానికి నాలుగేళ్లుగా అవగాహన

తమ వివాహానికి సరైన అవగాహన, పెద్దల సమ్మతికి నాలుగేళ్ల సమయం పట్టిందని కొరకోల కీర్తికుమార్ చెప్పారు. ముందుగా ధైర్యం చేసి రింక తన తల్లిదండ్రులు మట్ సుమోటొ రియోకో, మట్ సుమటో తధాకకు ప్రేమ విషయం తెలియజేశారు. వారు ఆమెతో ఇండియా వెళ్లి అక్కడ నీవు ఉండగలవో లేదో చూసి రమ్మని చెప్పారు. అలా ఆమె ఇండియాకు వచ్చి, కొంతకాలం ఉండి తర్వాత తల్లిదండ్రులకు తన ఇష్టాన్ని తెలియజేసింది. కీర్తికుమార్ తల్లిదండ్రులు కొరకోల ప్రేమమ్మ, కొరకోల ప్రేమ్‌కుమార్ కూడా వారి ప్రేమకు పచ్చజెండా ఊపారు. దీంతో తల్లిదండ్రుల సమక్షంలో, సీఎస్ఐచర్చిలో, చర్చి పాస్టర్లు సంప్రదాయబద్ధంగా కీర్తికుమార్, రింకల వివాహం జరిపించారు.

అవనిపై హరివిల్లు



ముగ్గులు వేస్తున్న మహిళలు

నంద్యాల కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో శనివారం నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. 92 మంది మహిళలు వేసిన ముత్యాల ముగ్గులు మురిపించాయి. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు 12.00 గంటల వరకు జరిగాయి. రెండు గంటల వ్యవధిలో మహిళలు రంగువల్లులను అందంగా, చుక్కలతో తీర్చిదిద్దారు. చుక్కలతో, సహజసిద్ధంగా, సంస్కృతికి అద్దం పడుతూ ముగ్గులను తీర్చిదిద్దారు. ఉదయం నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే వచ్చి తమ తమకు కేటాయించిన స్థలాల్లో పేడతో అలికి సిద్ధం చేసుకున్నారు. ఇళ్ల దగ్గరి నుంచే రంగులను ముగ్గులకు సిద్ధం చేసుకొని వచ్చారు. మరి కొందరు మహిళలు గొబ్బెమ్మలు, రకరకాల రంగుల్లో ఉన్న పూలను, చెరకు గడలను, నవధాన్యాలను వెంట తెచ్చుకొని తాము వేసిన ముగ్గులను మరింత అందంగా తీర్చిదిద్దారు. ముత్యాల ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్, శివలావణ్య, మణిమంజరి వ్యవహరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ముఖ్య అతిథి బీసీ రాజారెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.6వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3వేలు అందజేశారు. అదేవిధంగా నాలుగు, ఐదు బహుమతులుగా రూ.2,500 చొప్పున అందజేశారు. వీటితో పాటు పదిమందికి కన్సోలేషన్, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు బ్రాంచ్ మేనేజర్ లక్ష్మణ్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, స్టాఫ్ రిపోర్టర్ సి.గోపాలకృష్ణ, యాడ్స్ అసిస్టెంట్ మేనేజర్ గోపాల్, ఏబీఎన్ ప్రతినిధి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకుందాం

బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మహిళలు కీలక భూమిక పోషించాలని బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల కంటే రాయలసీమ సంస్కృతీ, సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయన్నారు. రాయలసీమలో పండుగలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని, సీమ ప్రజలు ఉన్నంతలో పండుగలను గొప్పగా చేసుకుంటారన్నారు. కుటుంబంతో పాటు సమాజాన్ని చక్కదిద్దగలిగే శక్తి ఒక్క మహిళకే ఉందన్నారు. కన్న పిల్లలను మార్కులు తెచ్చే యంత్రాలుగా కాకుండా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పిల్లలు మారాం చేస్తే సెల్‌ఫోన్లు ఇచ్చి బుజ్జగించే విష సంస్కృతికి స్వస్తి పలకాలన్నారు. మన బిడ్డలకు మానవీయ విలువలతో పెంచితేనే వృద్ధాప్యంలో అనాథ ఆశ్రమాల్లో వదిలేయకుండా బాగా చూసుకుంటారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం దేశం గొప్పతనమన్నారు. ముగ్గుల పోటీలకు స్పాన్సర్ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు బీసీ రాజారెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించాలని ఉంది

నంద్యాల జిల్లాస్థాయి ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినందుకు సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముగ్గుల పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైతే అక్కడ రాణించి మొదటి బహుమతి సాధించాలని ఉంది. గతంలో రాష్ట్రస్థాయికి ఎంపికై విజయవాడలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్నాను. ఈ ఏడాది ముగ్గుల పోటీలు ఉత్సాహంగా, ఉత్కంఠ భరితంగా జరిగాయి.

-శ్రీలక్ష్మి, నంద్యాల, ప్రథమ బహుమతి విజేత

ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు

మహిళలను ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి సంవత్సరం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతి, ఏబీఎన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మహిళలు పోటాపోటీగా తీర్చిదిద్దిన రంగవల్లుల్లో ప్రత్యేక స్థానం సాధించి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉంది.

- రామేశ్వరమ్మ, బేతంచర్ల, ద్వితీయ బహుమతి విజేత

ఏటా పాల్గొంటున్నాను

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రతిసారి పాల్గొంటున్నాను. మహిళల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయి. తెలుగుదనం ఉట్టిపడేలా ముగ్గులు వేయడం ఎంతో ఇష్టం.

- ప్రశాంతి, పాణ్యం, తృతీయ బహుమతి విజేత



బీసీ రాజారెడ్డిని సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది



మాట్లాడుతున్న అతిథులు



ముగ్గులు వేస్తున్న మహిళలు



40 ఎకరాల్లో పుట్టగొడుగుల పరిశ్రమ



ప్రత్యేక బాక్సుల్లో తరలింపు

ఓర్వకల్లు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : వేల ఏళ్ల క్రితం ఈజిప్టును పరిపాలించిన ఫారోలు పుట్టగొడుగుల రుచిని ఆస్వాదించారు. ప్రాచీన కాలంలో గ్రీకులు, రోమన్లు వీటిని సైనికులకు ఆహారంగా పెట్టేవారు. పుట్టగొడుగులు మొక్కల జాతికి కాకుండా శిలీంధ్రాల కిందికి వస్తాయి. దాంతో ఇప్పటికీ వీటి గురించి తెలియని చాలామంది ఇవంటే అయిష్టత చూపుతున్నారు. అయితే ఎన్నో ఔషధగుణాలు, పోషక విలువలు కలిగి, కమ్మని రుచితో ఆరోగ్యానికి హామీ ఇచ్చే పుట్టగొడుగులు నిజంగానే ఓ సూపర్ ఫుడ్. కర్నూలు జిల్లాలోనే ఈ పుట్టగొడుగులను ఓ భారీ పరిశ్రమలో కృత్రిమ పద్ధతిలో సాగు చేస్తున్నారు.

- 2018లో ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- మార్కెట్‌లో ఓర్వకల్లు పుట్టగొడుగులకు భలే గిరాకీ
- రోజూ పది టన్నుల మేర ఉత్పత్తి
- స్థానికులకూ ఉపాధి అవకాశాలు మెరుగు

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండల పరిధిలోని కాల్వ గ్రామం నుంచి కొమ్ముచెరువు ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే దారి పక్కనే (ఫ్రెష్ బౌల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్) పేరుతో పుట్టగొడుగుల పరిశ్రమ ఉంది. 2017లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో పుట్టగొడుగుల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. మొదటి విడతలో రూ.40 కోట్లు, రెండో విడతలో రూ.85 కోట్లతో యాజమాన్యం పనులు మొదలుపెట్టింది. ఇతర రాష్ట్రాల వారు, స్థానికులతో కలిపి అగ్రికల్చర్ డిప్లమో ఉద్యోగులు, కూలీలు మొత్తం 370 మంది సిబ్బంది ఈ పరిశ్రమలో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమలో ప్రత్యేకంగా బటన్ రకం పుట్టగొడుగులను కృత్రిమ పద్ధతిలో పండిస్తున్నారు. ఒక పుట్టగొడుగు పెద్దగా కావడానికి 15 రోజుల సమయం పడుతుంది. ఇలా రోజుకు 10 టన్నుల దాకా పంటను ఉత్పత్తి చేసి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాగే కర్నూలు, నంద్యాల, బేతంచెర్ల, బనగానపల్లె పట్టణాలతో పాటు, ఓర్వకల్లు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పరిశ్రమ వద్దకు వెళ్లి పుట్టగొడుగులను కొనుగోలు చేస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం వర్మీకంపోస్ట్ ఎరువును రైతులకు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యాన్ని రైతులు అభినందిస్తున్నారు. పుట్టగొడుగుల పరిశ్రమను ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, రైతులు సందర్శించి పుట్టగొడుగుల తయారీని పరిశీలించి అవగాహన పెంచుకుంటున్నారు.



పుట్టగొడుగులను కోస్తున్న కూలీలు

పోషకాల పుట్టగొడుగులు

పలు రకాల పుట్టగొడుగులు మార్కెట్‌లో ప్రతిచోటా లభ్యమవుతున్నాయి. పుట్టగొడుగు శాస్త్రీయ నామం అగారికస్ బిస్పోరస్. వీటిలో ప్రొటీన్స్, బి.కాంప్లెక్స్, సి, డి విటమిన్లు, ఫైబర్, జింక్, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్, కొలెస్ట్రాల్‌లను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలు ఈ పుట్టగొడుగుల్లో ఉన్నాయి. అంతేగాక మెదడు, పేగులను పుట్టగొడుగులు చైతన్యపరుస్తాయి. ఇంతటి ప్రయోజనాలున్న పుట్టగొడుగులకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

యాంటీ ఆక్సిడెంట్ల గని



పుట్టగొడుగుల్లో యాంటీ ఆక్సిడెంట్ సెలీనియంలు ఎక్కువ. వీటిలో ఎర్గోథియోనైన్ అనే యాంటీఇన్‌ఫ్లమేటరీ సూక్ష్మపోషకం ఉంటుంది. ఇది మన శరీర కణాలను రక్షిస్తుంది. వండినప్పుడు ఇది పుట్టగొడుగుల నుంచి విడుదలవుతుంది. పుట్టగొడుగులు శరీరంలో తెల్ల రక్తకణాల వృద్ధిని ప్రేరేపిస్తాయి. ఇవి తేలిగ్గా అరిగిపోతాయి. పొట్ట సమస్యలను, పేగుల్లో ఆహారం నిల్వ ఉండటాన్ని తొలగించేస్తాయి. వీటిలో ఫైబర్ ఎక్కువ, క్యాలరీలు తక్కువగా ఉండటంతో శరీరంలో క్యాలరీల భారాన్ని తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడతాయి. పుట్టగొడుగులు కాలేయానికి టానిక్ లాంటివి. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్నీ కాపాడుతాయి. ఆస్తమా, ఇతర శ్వాసకోశ సమస్యలను అదుపులో ఉంచుతాయి. అంతేకాదు డయాబెటిస్ రోగులకు అవసరమైన ఇన్సులిన్ హార్మోన్‌ను స్రవించే క్లోమగ్రంథి పనితీరును మెరుగుపరుస్తాయి. కాబట్టి మధుమేహ రోగులకు కూడా ఇవి మంచి ఆహారమే. దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమితో బాధపడేవారికి కూడా పుట్టగొడుగులు గొప్పగా పనిచేస్తాయి.

పుట్టగొడుగుల పెంపకంపై రైతులను చైతన్యపరచాలి



పుట్టగొడుగులు మంచి పోషకాలు ఉన్న ఆహారం. వీటి పెంపకం మంచి కుటీర పరిశ్రమ. వర్షాకాలంలో తేమగా ఉండే ప్రాంతాల్లో పెరిగే వీటిని కృత్రిమపద్ధతుల్లో పెంచవచ్చు. తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు ఆర్జించవచ్చు. పుట్టగొడుగుల పెంపకంపై రైతులను, యువతను ప్రభుత్వం చైతన్య పరచాలి. ఓర్వకల్లు మండలంలో రైతులు, యువత పుట్టగొడుగుల పెంపకంపై ఆసక్తి చూపిస్తే మా పరిశ్రమ ద్వారా వర్మీకంపోస్ట్ ఎరువును ఉచితంగా అందిస్తాం.

- డాక్టర్ వీకేవీ ప్రసాద్, పరిశ్రమ ఎండీ

కాల్వ గ్రామానికి మౌలిక వసతులు కల్పిస్తున్నారు



గ్రామ సమీపాన ఉన్న పుట్టగొడుగుల పరిశ్రమ యాజమాన్యం గ్రామంలో ఏ సమస్య ఉన్నా తక్షణమే స్పందించి పనులు చేయడం జరుగుతుంది. అలాగే గ్రామ రైతులకు ఉచితంగా వర్మీ కంపోస్టును కూడా అందిస్తున్నారు. పరిశ్రమ ఏర్పడటంతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

- ఖాదర్‌బాషా రైతు, కాల్వ గ్రామం

ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు



పుట్టగొడుగుల పరిశ్రమలో గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు పరిశ్రమ యాజమాన్యం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. గ్రామంలో ఉన్న కూలీలకు కూడా పరిశ్రమలో పనులు పుష్కలంగా ఉన్నాయి. గ్రామ సమీపాన పరిశ్రమ ఏర్పడటంతో భూములకు మంచి గిరాకీ వచ్చింది.

- నాగిరెడ్డి ఎంపీటీసీ, కాల్వ గ్రామం

గంజాయి కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల తాలుకా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ఈశ్వరయ్య, ఎస్ఐ ఎస్.గంగయ్య యాదవ్, ఏఎస్సై కె.హరినాథరెడ్డి సిబ్బంది శనివారం గంజాయి కేసులో నిందితులను అరెస్ట్ చేశారు. శిరివెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన జింకల మద్దిలేటి, మహదేవపురంకు చెందిన బొంత శ్రీనివాసులు, నంద్యాల మండలం అయ్యలూరు మెట్టకు చెందిన షేక్ యూసుఫ్‌లను శనివారం సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో అరెస్ట్‌చేసి వారి వద్ద నుంచి 5కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఏ1 నిందితుడైన జింకల మద్దిలేటికి సామర్లకోటకు చెందిన వాసు అనే వ్యక్తితో పరిచయం ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. వాసు సహాయంతో ప్రధాన నిందితుడు జింకల మద్దిలేటి రైలు ద్వారా గంజాయిని తెప్పించుకొని నంద్యాల, చుట్టుపక్కల గ్రామాలలో ఏ2 నిందితుడు బొంత శ్రీనివాసులుతో కలిసి గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకొని సొమ్ము చేసుకుంటుండేవారన్నారు. శనివారం ఏ3 నిందితుడు షేక్ యూసుఫ్‌కు గంజాయి ఇస్తుండగా నంద్యాల తాలుకా పోలీసులు దాడిచేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఏ1 నిందితుడు జింకల మద్దిలేటిపై గతంలో అవనిగడ్డలో, మహానంది పోలీస్ స్టేషన్ లోనూ గంజాయి కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్టులో కీలకపాత్ర పోషించిన నంద్యాల తాలుకా సీఐ ఆర్.ఈశ్వరయ్య, ఎస్సై ఎస్.గంగయ్య యాదవ్, ఏఎస్ఐ కె.హరినాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, పి.అయూబ్‌ఖాన్, పోలీస్ కానిస్టేబుళ్లు డి.జిలానిబాషా, రామ్‌గోపాల్, పీవీకేనాయుడు, గంగాధర్‌లను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి అభినందించారు. గంజాయికి సంబంధించి 1972 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని పోలీస్ అధికారులు ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు

9న వేలం పాట

కర్నూలు అర్బన్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం డిపోలో ఫ్రీజర్స్-93, ఇన్వర్టర్ బ్యాటరీలు-96, స్కానర్స్-192, క్యాష్ కౌంటింగ్ మిషన్స్-70, వేలం ప్రక్రియ ద్వారా అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని డిపో మేనేజర్ విజయకుమార్ తెలిపారు. ఈ నెల 9న 10 గంటలకు డిపోలో వేలం ప్రక్రియలో పాల్గొన దలచిన వారు రూ.5 వేల ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చు అన్నారు.

జిల్లాలో 305 డెంగీ కేసులు

- మలేరియా జోనల్ అధికారి

కర్నూలు హాస్పిటల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024లో 305 డెంగీ, 17 మలేరియా కేసులు నమోదైనట్లు జోనల్ మలేరియా అధికారి డా.లక్ష్మణ్ నాయక్ తెలిపారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయన జిల్లాలోని వ్యాధి నిర్ధారణను పరిశీలించారు. ముందుగా డాక్టర్స్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని అరోరానగర్‌లో జోనల్ మలేరియా అధికారి పర్యటించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా నివారణకు ప్రజలు తమ ఇంటి వద్ద పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవలని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్‌తో కలిసి చికెన్ గున్యా లక్షణాలపై అవగాహన కల్పించారు. వైద్యులు డాక్టర్ సునీల కుమారి, ఎంటమాలజిస్టు వెంకటేశ్వర్లు, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మాయమాటలతో రూ.21 లక్షల బురిడీ

- ఒకరి అరెస్టు.. పరారీలో మరికొందరు



నిందితుడిని చూపుతున్న పోలీసులు

పెద్దకడుబూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): 'డబ్బులను వర్షంలా కురిపిస్తాం..మీ దగ్గర ఉన్న డబ్బులను రెట్టింపు చేస్తాం.. రైస్ పుల్లింగ్ ద్వారా అధికంగా డబ్బులు సంపాదించకోవచ్చు' అంటూ కొందరు బాబాలు బురిడీ కొట్టించారు. రూ.21 లక్షలతో మోసం చేశారు. సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్ రెడ్డి వివరాల మేరకు.. మహబూబ్ నగర్ జిల్లా శాశంపల్లి గ్రామానికి చెందిన సందుల రవి మండలంలోని హెచ్ మురవణి గ్రామానికి చెందిన వెంకటేష్ దగ్గర రూ.21 లక్షలు తీసుకొని రెట్టింపు చేస్తామని చెప్పి మోసం చేశాడు. వెంకటేష్ వారి మాయమాటలు నమ్మి రూ.21 లక్షలను ట్రంకు పెట్టెలో పెట్టాడు. తర్వాత సందుల రవి, పూజారులు కలిసి పూజకు పూనుకున్నారు. మధ్యలో ఓ వస్తువును తీసుకురమ్మని వెంకటేష్‌ను బయటకు పంపారు. ఆ సమయంలో ట్రంకు పెట్టెలోని డబ్బు న్న తీసుకొని వాటి స్థానంలో పేపర్లు పెట్టారు. పూజ అనంతరం పెట్టెను ఇక్కడే ఉంచి నదీ స్నానం చేయాల్సి ఉంటుందని నమ్మించి మంత్రాలయం వెళ్లారు. అక్కడ నదీ స్నానాలు చేశారు. నీవు ట్రంకు పెట్టెపై నదీజలాన్ని చల్లి తెరిచి చూస్తే డబ్బు రెట్టింపై ఉంటుందని చెప్పారు. నీవు ట్రంకు పెట్టెను చూసిన తర్వాత మరలా నీవు తిరిగి రావాలని చెప్పి పంపారు. దీన్ని నమ్మిన బాధితుడు వెంకటేష్ ఇంటికి వెళ్లి ట్రంకు పెట్టెను తెరిచి చూడగా పేపర్లు కనిపించాయి. అందులోని రూ.21 లక్షలు కనిపించకపోవడంతో మోసపోయానని తెలుసుకొని నిందితులు సందుల రవితోపాటు మరో నలుగురికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. మోసపోయానని తెలుసుకొని పెద్దకడుబూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి విచారణ చేపట్టి నిందితుల్లో సందుల రవిని అరెస్టు చేయగా మిగతావారు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

రూ.20 కోట్ల భూమిని కాజేశారు..!

- బతికున్న వ్యక్తి చనిపోయినట్లుగా మరణ ధ్రువీకరణ పత్రం సృష్టి
- ఆపై అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి వేరొకరికి రిజిస్ట్రేషన్

ఆదోని, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.20 కోట్ల భూమిని కాజేశారు. మండగిరిలో నివాసముంటున్న ఎగ్గటి ఈశ్వరప్పకు బైపాస్ సమీపంలోని సర్వే నెంబర్ 321-ఏలో 6.51 ఎకరాల ఎ భూమి వారసత్వంగా వచ్చింది. నేషనల్ హైవే పొలంలోనే వెళ్లడంతో భూమి ధరలు పెరిగి పోయాయి. మార్కెట్‌లో ఎకరా రూ.3 నుంచి రూ.4కోట్లు పలుకుతుండటంతో దానిపై కూటమికి చెందిన ఓ నాయకుడి కన్నుపడింది. దీంతో భూయజమాని ఎగ్గటి ఈశ్వరప్ప 2009లో మృతి చెందినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ పుట్టించారు.

నంద్యాల పట్టణం లోని ఉప్పరిపేటలో నివాసం ఉంటున్న లేట్ ఎగ్గటి ఈశ్వరప్ప, కేరఫ్ ఆముదాల సుబ్బరాయుడు కుమా రుడు ఆముదాల భాస్కర్ ఆ పొలంపై సర్వాధికారాలు తనవి అన్నట్లుగా డాక్యుమెంట్లు తయారు చేసుకొని గోనెగండ్ల మండలం పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన చాకలి కరైన్న గారి కుమారుడు ఈరన్నకు 2024 డిసెంబరు 31వ తేదీన ఆగమేఘాల మీద ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం ప్లాట్లు వేశారు. సమాచారం తెలుసుకున్న రైతు ఎగ్గటి ఈశ్వరప్ప సబ్ రిజిస్టర్ కార్యాలయంలో విచారించి, రిజిస్ట్రార్‌కు తన భూమి డాక్యుమెంట్లు చూపించారు. బతికున్న వ్యక్తి చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ ఎలా పుట్టించారని ఈశ్వరప్ప కుమారులు మోహన్ కుమార్, సునీల్ కుమార్ నిలదీశారు. దీంతో రిజిస్ట్రార్ కార్యాలయంలో కొద్దిసేపు గందరగోళ వాతావరణం కనిపించింది. సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ రమేష్ డాక్యుమెంటు సిద్ధం చేయాలని తనకు చెప్పడంతోనే చేశానని, తనకు తనకు సంబంధం లేదని డాక్యుమెంట్ రైటర్ మహబూబ్ వివరించారు. బతికున్న వ్యక్తి 2009లో మృతి చెందినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ పుట్టించి రిజిస్టర్ ఎలా చేశారని, అందులో ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కూడా కరెక్ట్‌గా లేదని సబ్ రిజిస్ట్రార్ హాజీమియాను బాధతులు నిలదీశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ రికార్డులను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. బాధితుడు ఈశ్వరప్ప కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ హాజీ మియాను వివరణ కోరగా.. డాక్యుమెంట్లు అధికంగా వస్తున్నాయని, దీనిని సరిగా చూడలేదని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, నిందితులపై కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు.



సబ్ రిజిస్ట్రార్, సిబ్బందితో బాధితుల వాగ్వాదం



బైఠాయించిన బాధితుడు

సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఐదుగురిపై కేసు నమోదు

ఆదోని పట్టణంలోని ఎగ్గటి ఈశ్వరప్పకు చెందిన క్రమ సంఖ్య 321-ఏలో ఉన్న 6.51 ఎకరాలను నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించయాకరి బాధితుడి ఫిర్యాదు మేరకు... సబ్ రిజిస్ట్రార్ హాజీ మియాతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్, డాక్యుమెంట్ రైటర్ మహబూబ్, పొలాన్ని అమ్మిన వ్యక్తి ఆముదాల భాస్కర్, కొన్నవ్యక్తి చాకలి ఈరన్నపై భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ సోమన్న తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీకి చోటు

- ట్రాన్స్‌కోకు అదనంగా 10,800 మెగావాట్ల విద్యుత్ సమకూరే అవకాశం
- సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- ఐదేళ్ల విద్యుత్ ప్లాన్‌కు ఆమోదం తెలిపిన ఫోరం



మాట్లాడుతున్న సీఎస్, ఇన్‌చార్జి ఛైర్మన్

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల విద్యుత్ ప్రణాళికలో భాగంగా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ(ఐసీఈ) పాలసీకి చోటు లభిం చింది. 2024 అక్టోబరు 21న జరిగిన ఏపీ ఈఆర్సీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఐసీఈపై విస్తృత స్థాయి చర్చ, అవసరమైన మార్పులు, చేర్పులతో రాష్ట్ర సమన్వయ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ పాలసీ దేశంలో రాష్ట్రాన్ని పునరుత్పాదక పంప్డ్ హైడ్రో సోరేజీ హబ్‌గా మారు స్తుందన్న ఆశాభావాన్ని కమిషన్ వ్యక్తం చేసింది. శనివారం జిల్లా కేంద్రంలోని ఏపీఈఆర్సీ భవన్‌లో ఇన్‌చార్జ్ ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ అధ్యక్షతన ఏపీ ట్రాన్స్‌కో 5వ విద్యుత్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ట్రాన్స్‌కో ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ విజయానంద్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి పట్టంశెట్టి, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి హాజరై 2024-2025 నుంచి 2028-29 ఆర్థిక ఏడాదికి సంబంధించి రాష్ట్ర విద్యుత్ ప్రణాళికపై చర్చించి ఆమోదం తెలిపారు. స్టేట్ ట్రాన్స్ మిషన్ యుటిలిటీ(ఎస్‌టీయూ) ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈఆర్సీ లోడ్ ఫోర్‌కాస్ట్ , రిసోర్స్ ప్లాన్ మార్గదర్శకాల మేరకు ప్రతి ఐదేళ్లకు నియంత్రణ వ్యవధి కోసం లైసెన్స్ దారుల లోడ్ సూచన, వనరుల ప్రణాళి కలకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అందులో భాగంగా ఏర్పాటైన సమావేశంలో విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ, సరఫరాను ప్రోత్సహించడానికి ఏపీజెన్‌కో, ఏపీ డిస్కమ్‌లతో చర్చించారు. తద్వారా సమావేశంలో ఆమోదం పొందిన ఐఈసీ పాలసీ ద్వారా ఏపీట్రాన్స్‌కోకు అదనంగా 10,800 మెగావాట్ల విద్యుత్ సమకూరుతుందని భావిస్తున్నారు. ఫోరం ఏపీట్రాన్స్‌కో రూపొందించిన స్టేట్ ఎలక్ట్రిసిటీ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించి దానిని ప్రచురించడానికి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఏపీఈఆర్సీ ఇన్‌చార్జ్ ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ మాట్లాడుతూ రాబోయే వేసవిలో నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాల్సిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రబీ పంటలకు కరెంట్ కోతలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యుత్ ప్రమాదాలు పెరిగిపో తుండటంతో భద్రతా చర్యలను పెంచి పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రమాద కేసులు తగ్గుముఖం పట్టేలా చూడాలని మృతుల కుటుంబాలకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఈఆర్సీ సభ్యుడు పీవీఆర్.రెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీలు పృథ్వితేజ్, సంతోషరావు, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ అశోక్‌కుమార్, ఎన్‌టీపీసీ జనరల్ మేనేజర్ రోహిత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో ఇస్రో నోడల్ ఆఫీసు

కర్నూలు అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇస్రో భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ స్టార్స్ అన్‌లైన్ నోడల్ ఆఫీసుగా క్లస్టర్ యూనివర్సిటీ ఎంపికైందని ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. యూజీపీజీ విద్యార్థుల కోసం ఈ ఆన్‌లైన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రయోజనాన్ని ఇస్తుందని ఇలాంటి అవకాశం క్లస్టర్ యూనివర్సిటీకి రావడం సంతోషించదగ్గ విషయమని రిజిష్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ శిక్షణ ఈ నెల 9 నుండి 31 వరకు జరుగుతుందని, అసక్తి గల డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కస్లర్ యూనివర్సిటీలో సంప్రందించాలని కోరారు. ఈ ట్రైనింగ్ ప్రోగామ్‌కు నోడల్ సెంటర్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం పద్మావతి, నిర్వాహక సభ్యులుగా డాక్టర్ వాయిజ్, డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ లక్ష్మణ్ గుప్తా నియమించబడ్డారు.

ఘనంగా స్వర్ణోత్సవాలు

- వేలాదిగా తరలివచ్చిన పూర్వ విద్యార్థులు
- విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానం



అధ్యాపకుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు అంబరాన్ని అంటాయి. 1974లో ఏర్పాటైన ఈ కళాశాల 50 ఏళ్లను పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా రెండు రోజులపాటు జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా తొలి రోజైన శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల ఆనందాలకు అవధుల్లేకుండా పోయాయి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అలనాటి మధుర జ్ఞాపకాలతో, తోటి స్నేహితులతో పులకించారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వర్ణోత్సవ వేడుకల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడితే దేన్నైనా సాధించవచ్చునన్న విషయానికి ప్రస్తుత పూర్వ విద్యార్థులను చూస్తే అర్థమవుతుందన్నారు. అప్పట్లో ఎలాంటి సదుపాయాలు లేనప్పటికీ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడం మామూలు విషయం కాదన్నారు. త్వరలోనే ఇంజనీర్ కళాశాల కోసం ప్రతిపాదనలు తయారు చేయిస్తానని తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ ఆఫీసర్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాల విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతిఏటా విద్యార్థులకు నగదు పారితోషికాలు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. తనవంతుగా రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. మరో విశ్రాంత ఐఏఎస్ అధికారి జగన్నాథం మాట్లాడుతూ.. తమ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం చూస్తూ గాల్లో తేలిపోయినంత ఆనందం కలుగుతోందని అన్నారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, పారిశ్రామికవేత్త ఆవుల నారాయణరెడ్డి కళాశాల అభివృద్ధికి రూ.15లక్షల విరాళాన్ని అందజేశారు. అలాగే విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అలనాటి అధ్యాపకులను సత్కరించారు. వేడుకకు విచ్చేసిన వారందరికి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి రెండు రోజుల పాటు భోజన సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, డీఆర్‌డీఏ శాస్త్రవేత్త వీరబ్రహ్మం, కళాశాల స్థలదాత కుటుంబీలు వెన్నా భోగిరెడ్డి, డాక్టర్లు గోవిందరాజులు, డాక్టర్ శంకర శర్మ, డాక్టర్ గౌరీనాథ్ ఉన్నారు.

ఆనందంగా ఉంది



నేను అధ్యాపకునిగా పని చేసిన కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది. విద్యార్థులు ప్రయోజకులుగా మారారు. రాణించిన విద్యార్థులకు నగదు పారితోషికాలు ఇవ్వడం వారిలో మరింత స్ఫూర్తినింపుతోంది.

- కుమార్, ఫస్ట్ బ్యాచ్ బాటనీ అధ్యాపకుడు

సంతోషంగా ఉంది



కళాశాల స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకోవడం సంతోషంగా ఉంది. కుమార్ సార్ మార్గదర్శకాలే ఉన్నత స్థాయిలో నిలిపాయి.

- డాక్టర్ శంకర్‌శర్మ, గాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

కొందరు లేక బాధ..



మా బ్యాచ్‌లో 148 మంది ఉండగా, కొందరు స్నేహితులు లేక పోవడం బాధేస్తోంది. ఎస్వీ నారాయణ 2009 లో ఓ సారి ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశాం. రూ.4లక్షల వరకు కళాశాల అభివృద్ధికి తోడ్పాటునందించాం. మున్ముందు కూడా సహకరిస్తాం.

- ఎస్వీ ప్రసాద్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, నంద్యాల

'విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి'



విజేతలైన విద్యార్థులతో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తిని పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వెంకాయపల్లె రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో శామ్యూల్ పాల్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలులో ఒకప్పుడు సరైన పాఠశాలలు లేవని, నేడు రాష్ట్రస్థాయి గుర్తింపు పొందే సంస్థలను రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య నిర్వహిస్తున్నారన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆలోచనలు దాగి ఉన్నాయని వారి ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ఉపాధ్యా యులదేనని అన్నారు. అనంతరం రాష్ట్రస్థాయికి ఎంపికైన విజేతలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సర్టిఫికేట్లు బహుమ తులు ప్రదానం చేశారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి హనుమంతురావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్, రవీంద్ర గ్లోబల్ స్కూల్ సీఈవో వంశీధర్, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, పాల్గొన్నారు.

విజేతలు వీరే

- వ్యక్తిగత విభాగంలో కోసిగి ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థి పి.ప్రణయ్ కుమార్ రెడ్డి తయారు చేసిన 'ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్' అంశం ఎంపికైంది. ద్వితీయ స్థానంలో కామవరం జడ్పీహైచ్ తొమ్మిదో తరగతి విద్యార్థి హెచ్.సంజన్న తయారు చేసిన 'ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్' ప్రాజెక్టు ఎంపికైంది.
- గ్రూపు విభాగంలో కంబలపాడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వై.రవీంద్రనాథ్ ఠాగూర్, బి.దివాకర్ తయారు చేసిన 'పొల్యూషన్ కంట్రోల్ సిస్టమ్' ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో వెల్దుర్తి ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు కె.మహిత, జి.గాయత్రి తయారు చేసిన 'వెహికల్ ప్రొటెక్షన్ కవర్' ప్రాజెక్టు ఎంపికైంది.
- టీచర్ విభాగంలో గోనెగండ్ల జడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎం.అమానుల్లాబేగ్ తయారు చేసిన 'ఎర్త్ సైన్స్' ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గంజెహళ్లి జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయిని ఎస్.రంగమ్మ తయారు చేసిన 'ఏఐ పవర్డ్ మోడ్రన్ ఎకో సిస్టమ్ టూ నేచురల్ రిసోర్సెస్' ప్రాజెక్టు ఎంపికైంది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన కలెక్టర్, ఎస్పీ


రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్, ఎస్పీ

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ ప్రణాళికలో భాగంగా స్టేట్ కోఆర్డినేటర్ ఫోరం సమావేశానికి కర్నూలు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు కలెక్టర్ రంజిత్‌బాషా, జేసి నవ్య, ఎస్పీ బిందుమాధవ్ స్వాగతం పలి కారు. శనివారం కర్నూలు నగర శివార్లలోని ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయంలో ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా శ్రీనివాసులు



కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా టి.శ్రీనివాసులు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీసీగా పని చేస్తున్న విజయకుమారి బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. ఈమె స్థానంలో జిల్లా విద్యా శాఖ అధికారి శ్యామ్యూల్‌పాల్‌కు ఇన్‌చార్జి బాధ్య తలు అప్పగించారు. టి.శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించడంతో ఈ పోస్టు భర్తీ అయింది. ఉద్యోగ బాధ్యతలు స్వీకరిం చిన శ్రీనివాసులును కార్యాలయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బలరామిరెడ్డి, ఇంజ నీరింగ్ అధికారులు, కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు శ్రీనివాసులు కలెక్టర్ రం జిత్ బాషా, జాయింట్ కలెక్టర్ నవ్యను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఓర్వకల్లులో టీడీపీ సీనియర్ నాయకుడు సూర్య నారాయణ రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హుశేనాపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థు లకు మిఠాయిలు పంపిణీ చేశారు. బ్రాహ్మణపల్లె, శకునాల, ఉయ్యాల వాడ, లొద్దిపల్లె తది తర గ్రామాల్లో బైరెడ్డి శబరి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పద్మనాభం, నాయకులు కృష్ణారెడ్డి, వందనాలు, ఎర్రమల మద్దయ్య, గోప కృష్ణారెడ్డి, గొల్ల నాగరాజు, బాల వెంకటరమణ పాల్గొన్నారు.

పీడీ యాక్టు నమోదు చేయాలి


వినతి పత్రం ఇస్తున్న డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, మహేష్ నాయుడు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందించే పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై పీడీ యాక్టు నమోదు చేయాలని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్లు కొంకతి లక్ష్మీనారాయణ, మహేష్ నాయుడులు శనివారం ఏపీ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరుగుతున్న రేషన్ మాఫియాపై ఉక్కు పాదం మోపాలని ఆయనకు విన్నవించారు. ఈ మేరకు తనిఖీలు, చెక్ పోస్టులు ఏర్పా టు చేసేందుకు జిల్లా అధికారులను ఆదేశించాలని కోరారు.

అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): బనవాసి బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్న అధ్యాప కులపై చర్యలు తీసుకోవాలని సీఎస్ విజయానంద్‌కు ఎస్ఎ ఫ్ఐ, ఐద్వా సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, శ్యామల, సాయి, ఆర్యన్ పాల్గొన్నారు.

ఎస్సీ జాబితా నుంచి తొలగించాలి

గూడూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాదాసి, మాదారి కురువలను ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ మణిరాజ్, టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్ డిమాండ్ చేశారు. శనివారం గూడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రామాంజ నేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు జె.సురేష్, మణిరాజ్ మాట్లాడుతూ మదాసి, మాదారి కురువలు ఎస్సీ కుల ధృవీకరణ పొందారని, దీనిపై విచారణ జరిపి వారిని ఎస్సీ జాబితా నుంచి తొలగించాలన్నారు.

ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలోని ఉల్చాల గ్రామంలో అక్రమంగా బెల్టుషాపు లను నిర్వహిస్తున్నట్లు నవంబరు 24న అధికారులకు వినతి పత్రం ఇచ్చామన్నారు. నెలరోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకోక పోవడం దారుణమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, మండల అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

చెత్త దిబ్బలను తొలగించాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలలో ఉన్న చెత్త దిబ్బలను తొలగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి కోరారు. శనివారం కమిటీ సభ్యులతో కలిసి కొత్తబస్టాండు, సీతారామనగర్‌లో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త దిబ్బలను తగలబెట్టడం వల్ల దుర్వాసన, పొగ రావడంతో అనారోగ్యా నికి గురికా వాల్సి వస్తుందన్నారు. నగర పాలక అధికారులు వెంటనే స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలి

● మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లు లోని ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూటమి ప్రభు త్వం నూతనంగా ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరిత, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. అనంతరం కళాశాలలో మధ్యా హ్న భోజనం పథకాన్ని వారు ప్రారంభించారు. కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం మధ్యాహ్న భోజనం పథకానికి రూ.27 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైసీపీ పాలనలో జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రవేశ పెట్టి నీరు గార్చిందన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొ రేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యా సాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో ఓంకార్ యాదవ్, ఎస్ఐ సునీల్ కుమార్, చింతలపల్లె సర్పంచ్ వెంకటర మణ, నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, అన్వర్ బాషా, ఏసేపు, అల్లాబాబు, జయకృష్ణ, విజయుడు, సర్కార్, అధ్యాపకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు కళాశాల ప్రాంగ ణంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిం చారు. మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు అమలుచేసిన మధ్యాహ్న భోజనాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని విమర్శించారు. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకుని మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభిం చారన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనం వడ్డించి, సహ పంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఎంపీడీవో రాముడు, తహసీల్దార్ రామాంజనేయులు, ఎంఈవో తైమూర్‌బాషా, టీడీపీ నాయకులు బడేసాబ్‌గౌడ్, యల్లప్పనాయుడు, కౌలుట్ల, గంగాధర్ నాయుడు, జేఎం రాముడు, రామాంజనేయులు, చిన్నతోటయ్య, బ్రిటిష్‌రాముడు, చిల్లబండ సత్తార్ పాల్గొన్నారు.

● **డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి:** ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే డిగ్రీ కళాశాల, బాలుర హాస్టల్ భవనాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజే శారు. ఏఐ ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ ఆర్డీవో ఇటీవల కొండప్రాంతంలో స్థల పరిశీలన జరిపారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. సదరు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వీరాంజనే యులు, మునిస్వామి పాల్గొన్నారు.

టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో .. కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకన్న, మండల విద్యాశాఖ అధికారి విజయకుమారి, పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు రాజకుమారి పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక దృష్టి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ: రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక దృష్టి సారించిందని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం పాతబస్తీలోని ప్రభు త్వ మైనార్టీ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవానికి కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్న శిఖరాలను అధిరో హించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కమిషనర్ భోజనం చేశారు. జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సమీనాబీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరం

గూడూరు: కూటమి ప్రభుత్వ ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వరమని సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ కె రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు అన్నారు. శనివారం గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ నాయకులు హాజరై విద్యా ర్థులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల ఆకలి తీర్చేం దుకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రమణ, కౌన్సిలర్ రేమట సురేష్, టీడీపీ నాయకులు గుడిపాడు మహేశ్వర రెడ్డి, రేమట వెంకటేశ్వర్లు, సృజన్, పౌలు, కో ఆప్షన్ సభ్యులు పుట్టపాశం రామాంజనే యులు, నాగప్ప యాదవ్, ఎస్సీ భాస్కర్ పాల్గొన్నారు.


ఓర్వకల్లులోని జూనియర్ కాలేజీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, మల్లెల రాజశేఖర్


కోడుమూరులో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



టౌన్ జూనియర్ కళాశాలలో భోజనం చేస్తున్న 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు



గూడూరులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వ్యక్తిత్వ వికాసంతో ఎదుగుదల

హిప్నోథెరపిస్టు సిరిగిరెడ్డి జయారెడ్డి


మాట్లాడుతున్న సిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు హాస్పిటల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం వ్యక్తిగత ఎదుగుదలకు దోహదపడుతుందని హిప్నోథెరపిస్టు డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి అన్నారు. ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవం సంద ర్భంగా వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాన్ని శనివారం ఉదయం కర్నూలు మెడి కల్ కాలేజీలోని న్యూలెక్చరర్ గ్యాలరీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులనుద్దేశించి ఆయనేనన మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని ఎమోషనల్ ఇంటెలిజెంట్‌తో తొలగించుకోవ చ్చున న్నారు. ఏకాగ్రతతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునన్నారు. డాక్టర్ కృష్ణమోహన్ మా ట్లాడుతూ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, హిప్నోథెరపి గురించి వివరించారు. అనంతరం జయారెడ్డి ఇచ్చిన ప్రాక్టికల్ సైంటిఫిక్ డెమో వైద్య విద్యార్థు లను ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి లేపాక్షి ఎంపోరియంలో 'థీమాటిక్ ఎగ్జిబిషన్'

కర్నూలు కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేపాక్షి ఎంపోరియంలో ఆదివారం నుంచి ఈనెల 13 వరకు 'థీమాటిక్ ఎగ్జిబిషన్' (తగ్గింపు ధరలతో ప్రదర్శనలు, విక్రయాలు) ఏర్పాటు చేసినట్లు కర్నూలులోని పెద్ద పోస్ట్ ఆఫీస్ ఎదు రుగా ఉన్న లేపాక్షి ఎంపోరియం ఇన్‌చార్జి మేనేజర్ బి.తిమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హస్తకళా ఉత్పత్తులపై 15 శాతం రాయితీ, చేనేత వస్త్రాలపై 10 శాతం ప్రత్యేక రాయితీ ఉం టుందన్నారు. కొండపల్లి, ఏటికొప్పాక, వైట్ మెటల్ బొమ్మలు, బంజారా కళాకారుల క్రోషెట్ లేస్, స్టోన్‌వేర్ ఫోటో ఫ్రేములు, వెల్వెట్ కార్పెట్లు, వైట్ వుడ్ బర్డ్స్, లెదర్ ల్యాంప్ షేడ్లు, బ్రాస్ అండ్ కాపర్ అలంకార వస్తువులు, పేపర్ మెష్ ఐటమ్స్ తోపాటూ వివిధ ప్రాంతాలకు చెందిన చేనేత వస్త్రాలు ఈ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తు న్నట్లు ఆయన తెలిపారు.

ఏసీ మాయంపై విచారణ

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాల యంలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగంలో ఎయిర్ కండిషనర్ మాయంపై విచారణ మొదలైంది. ఇటీవల ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై స్పందించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల పాటు పోలీసులు నగర పాలక కార్యాలయంలో పలువురిని విచారించారు. ఈ మేరకు సీసీ కెమెరాలు పరిశీలించాల్సి ఉంది.

హామీని నిలబెట్టుకోవాలి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో రెండో రోజూ శనివారం ధర్నాచౌక్ వద్ద నిరాహార దీక్షలు కొనసాగు తున్నాయి. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదలకు ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, పి.రామక్రి ష్ణారెడ్డి, సి.మహేష్ కుమార్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ సమితి పిలుపులో భాగంగా ఈనెల 7న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ స్కీమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్య దర్శి జే.లలితమ్మ పిలుపునిచ్చారు. శనివారం ఏఐటీయూసీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్కీం కార్మికులు, అంగ న్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేత నాల పెంపుదలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవా లన్నారు. కార్మికులందరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. నగర కార్యదర్శి జి.చంద్ర శేఖర్, అధ్యక్షుడు వెంకటేష్, డిప్యూటీ కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

కల్వర్టు తవ్వారు.. వదిలేశారు

కర్నూలు హాస్పిటల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ సర్కిల్‌లో ఉన్న కల్వర్టు రోడ్డు ధ్వంసమైంది. దీంతో వారం రోజుల క్రితం మున్సిపల్ సిబ్బంది కల్వర్టు రోడ్డును తవ్వారు. అయితే వారం రోజులవుతున్నా పనులు ప్రారంభించకపోవడంతో ఇరుకు దారిలో వెళ్లలేక పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.


అశోక్‌నగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. శనివారం పెద్దపాడు, ఎ.నాగలాపురం, వై.జంక్షన్, బీ.క్యాంపు, సీ.క్యాంపు ప్రాంతాలలో ఆయన పర్యటించి ప్రజల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. వై.జంక్షన్ సమీపంలోని వాసవి నగర ప్రాంతాల్లో రహదారుల నిర్మాణా నికి, సీ.క్యాంపు కూడలిలో నగర పాలక వ్యాపార సముదాయంలో మరమ్మతు పనులు చేపట్టాలని కమిషనర్ అధికా రులను ఆదేశించారు. పెద్దపాడులో పారిశుధ్య పను లను మరింత మెరు గుపరచాలని, బీ.క్యాంపులో నూతనంగా నిర్మిం చిన రహదారిపై స్పీడ్ బ్రేకర్లు స్పష్టంగా కనబడేలా సింబల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ శేషసాయి, డీఈ క్రిష్ణలత, ఏఈ భానుప్రతాప్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ అంజాద్‌బాషా, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు: నగర ప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుం టున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శనివారం మునగాల పాడులోని తాగునీటి సరఫరా(పంపింగ్ స్టేషన్) కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించాల న్నారు. డీఈఈ నరేష్, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

క్రీడాకారులు స్నేహభావంతో మెలగాలి


క్రీడాకారులతో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు స్నేహ భావంతో మెలగాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, రాష్ట్ర ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు పురుషోత్తం అన్నారు. శనివారం దిన్నెదేవ రపాడు సమీపంలోని కేఈ నివాసం వద్ద 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల కబడ్డీ రెండో రోజు పోటీలకు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా కేఈ ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడాకా రులు గెలుపు ఓటములను సమనాంగా తీసుకోవాలన్నారు. పురు షోత్తం మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేఈ జగదీష్ కుమార్, శ్రీనివాసులు, రాష్ట్ర కబడ్డీ సంఘం కార్యదర్శి కుమారి పద్మజ, బాల, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాశ్ శెట్టి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, శుభకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

యూసీపీఎల్‌ఆర్ఎఫ్ రాష్ట్ర చైర్మన్‌గా రాయపాటి శ్రీనివాస్



కర్నూలు కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ (యూసీపీఎల్‌ఆర్ఎఫ్) రాష్ట్ర చైర్మన్‌గా కర్నూలుకు చెందిన నైస్ యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకే షన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ నియమితుల య్యారు. శనివారం ఢిల్లీలోని ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఎన్. రామచంద్రన్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నైస్ సంస్థతోపాటూ లయన్స్ క్లబ్ ద్వారా గత రెండు దశాబ్దాలుగా అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పదవికి ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

హైందవ శంఖారావం సభకు ప్రత్యేక రైలు

కర్నూలు కల్చరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హిందూ ఆలయాల విముక్తికి, స్వయం ప్రతిపత్తి కోసం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో నిర్వహిస్తున్న హైం దవ శంఖారావం సభకు ప్రత్యేక రైలులో జిల్లాలోని వందలాది కార్యకర్తలు బయల్దేరారు. శనివారం రాత్రి 8.30 గంటలకు కర్నూలు నుంచి బయలుదేరిన ఈ ప్రత్యేక రైలును వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమి శెట్టి వెంకట్రామయ్య, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, సురేందర్ జీ, రఘువీర్ పూజలు చేసి, జెండా ఊపి ప్రారంభించారు.

ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలి

సి.బెళగల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మాదాసి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని మారందొడ్డికి గ్రామానికి చెందిన కురువ సంఘం నాయకుడు సుంకన్న శనివారం డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుంకన్న మాట్లాడుతూ మారందొడ్డి గ్రామంలో ఉన్న మాదాసి కురువలకు ఎస్సీ జాబితాలోనే ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, కృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

173 మంది ఎంపిక


ఫిజికల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు శనివారం ఐదో రోజు కొనసాగాయి. స్థానిక ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో నిర్వహించే ఈ పరీక్షలను ఎస్పీ జి. బిందుమాధవ్ పర్యవేక్షించారు. ఈ పరీక్షకు 739 మంది అభ్య ర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 327 మంది బయోమెట్రిక్‌కు హాజర య్యారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత ఫిజికల్ మెజర్మెంట్ టెస్టులు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషి యన్సీ టెస్టుల్లో 1600 మీటర్ల పరుగు పరీక్షలో 223 మంది అర్హత సాధిం చారు. 100 మీటర్ల పరుగులో 43 మంది అర్హత సాధించారు. లాంగ్‌జం ప్‌లో 172 మంది అర్హత సాధించారు. కానిస్టేబుల్ మెయిన్స్ (ఫైనల్) పరీక్షకు ఐదో రోజు 173 మంది మహిళా అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉలిందకొండను అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

కల్లూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం ఉలిందకొండలో పర్యటించి ఆమె పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీడీపీ ఇచ్చిన పిలుపులో భాగంగా సభ్యత్వాలు నమోదు చేసి పాణ్యంలో మొదటి స్థానంలో నిలిచిన క్లస్టర్ ఇన్‌చార్జి మాదేష్, బూత్‌లెవల్ ఇన్‌చార్జిలు శ్రీకాంత్, వెంకటరమణ, కలాం, మహేంద్ర, కరీం, మద్దయ్య, యూనిట్ ఇన్‌చార్జ్ షేక్షావలి, విక్రంలను ఎమ్మెల్యే గౌరు చరిత శాలువా కప్పి అభినందించారు. టీడీపీ ముఖ్య నాయకుడు ఈవీ రమణ మాట్లాడుతూ గౌరు దంపతుల సహకారంతో రూ.5 కోట్ల నిధులతో ఉలిందకొండను ఆదర్శ గ్రామంగా తయారు చేసుకుందామని అన్నారు. అనంతరం ఉలిం దకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రూ.38 లక్షలతో భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే రూ.10 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పూరైన రెండు సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. అనంతరం రూ.23 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో గ్రామంలో విలేజ్‌పార్క్ ఏర్పాటు కు గౌరుచరిత భూమిపూజ చేశారు. ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, రంగస్వామి రెడ్డి, ఆర్ అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు, ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి, పీఆర్ డీఈ నాగిరెడ్డి, ఏఈ రవిమోహన్‌రెడ్డి, సర్పంచు సుంకులమ్మ పాల్గొన్నారు.

రేపు బాలబాలికల టెన్నికాయిట్ జట్ల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్స్ టెన్ని కాయిట్ జట్ల ఎంపిక పోటీలు సోమవారం నగరం లోని గుత్తి పెట్రోల్ బంకు వద్ద ఓరియంట్ ఇంగ్లీషు మీడియం పాఠశాల క్రీడా ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 2006 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు. వివరా లకు 9398401721 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలి

హొళగుంద, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని పద్మశాలీలకు ఇవ్వాలని టీడీపీ నాయకుడు జేరుబండి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ కర్నూలు పార్లమెంట్ పరిధిలో అభ్యర్థుల గెలుపుకు పద్మశాలీలు కీలక పాత్ర పోషించారని కూటమి ప్రభుత్వం సముచిత స్థానం ఇవ్వాలన్నారు.

మంత్రి దృష్టికి రజకుల సమస్యలు

ఆదోని టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జీవోలు అమలయ్యేలా చూడాలని రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి కోరారు. శనివారం వెలగపూడిలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను కలిశారు. దోబీ పోస్టులను ఇతర కులాల వారికి కేటాయించారని, ఇక నుంచి రజకులకే కేటాయించాలని విన్నవించారు. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ల దుకాణాల్లో ఐదు శాతం రజకులకు ఇవ్వాలని మంత్రి దృష్టికి విన్నవించానని, మంత్రి సానుకూలంగా స్పందించాలని ఆమె తెలిపారు.


మంత్రితో సావిత్రి

రెవెన్యూ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు


ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి హెచ్చరించారు. శనివారం స్థానిక పసుల ఆసుపత్రి వెనుక ఉన్న పంచాయతీ స్థలాలను పరిశీలించారు. పత్రికల్లో కథనాలు, రావడం గ్రామస్థుల ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ హుశేన్ సాహెబ్ ఆదేశాల మేరకు స్థలాను పరిశీలించారు. నకిలీ పట్టాలతో స్థలాలను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నాని, ఆక్రమణదారులకు నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు.

టీడీపీ నాయకుల నివాళి


నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం మృతులకు టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి శనివారం నివాళి అర్పించారు. శనివారం చెన్నంపల్లికి అనంతపురం జిల్లా కిష్టపాడు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజశేఖర్ చౌదరి, సుమలత దంపతుల భౌతిక కాయాలు చేరుకున్నాయి. మృతుల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుం దని ఎమ్మెల్యే సంతాపం తెలిపినట్లు చెప్పారు. మాబాషా, లక్ష్మీనారా యణ చౌదరి, రామయ్య, గుర్రప్ప చౌదరి, అక్బర్ బాషా పాల్గొన్నారు.

కురవళ్లిలో రెవెన్యూ సదస్సు


దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్

ఆలూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవళ్లి గ్రామంలో శనివారం తహసీల్దార్ గోవింద్ సింగ్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రభుత్వం రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేదుకు కృషి చేస్తోందన్నారు. గ్రామాల్లో భూ తగాదాలు లేకుండా రైతులకు మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచ్ రవి, సర్వేయర్ అరుణ జ్యోతి, వీఆర్వోలు రవికుమార్, లింగన్న, వన్నూర్ పాల్గొన్నారు.

క్యాచ్‌మెంట్ ఏరియాలో మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఆదోని టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగు నీరందించే రాంజల చెరువు క్యాచ్‌మెంట్ ఏరియాకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. వర్షపు నీరు చెరువులోకి చేరుకుండా కొందరు ప్రహరీని తొలగించినట్లు అధికారులు గుర్తించారు. ఎంఈ ఇంతియాజ్ ఆదేశాల మేరకు డీఈ గోపీనాథ్ ఆధ్వర్యంలో శనివారం మరమ్మత్తులు చేశారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, రాంజల చెరువును నీటితో నింపుకొనే చర్యలు తీసుకొంటున్నట్లు ఎంఈ ఇంతియాజ్ తెలిపారు.

అండర్-12 క్రికెట్‌కు ఎంపిక

ఆదోని అగ్రికల్చర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లీల పాఠశాల విద్యార్థి వాగీషా శంకర్ రెడ్డి జిల్లా అండర్ -12 జట్టుకు ఎంపికైనట్లు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ ముజీబ్, కార్యదర్శి వెంకటేష్ కోచ్ బాలాజీ రావు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న సభ్యులు

దర్జాగా కబ్జా

- రియల్టర్ల దుర్మార్గం
- నోటీసు బోర్డు పీకేసిన వైనం


మద్దికెరలో ఆక్రమణకు గురైన పంచాయతీ స్థలం ఇదే

మద్దికెర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సర్వే.నెం.337లో బసవన్న ఆలయం వెనుక భాగంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు 16 సెంట్ల కల్లందొడ్డిని కొనుగోలు చేశారు. అయితే పక్కనే ఉన్న రూ.20లక్షలు విలువ చేసే పంచాయతీ స్థలాన్ని కలిపేసుకున్నారు.

పట్టించుకోని పంచాయతీ అధికారులు

స్థలం కబ్జా అవుతున్నా, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాట్లు వేయాలంటే పంచాయతీ, రెవెన్యూ అధికారుల అనుమతులు పొందాలి. కానీ మద్దికెర గ్రామంలో పలువురు అనుమతులి లేకుండానే ప్లాట్లు వేసి, విక్రయిస్తున్నారు. భూమిని చదును చేసేందుకు హంద్రీనీవా మట్టిని ఉపయోగిస్తున్నా, హంద్రీనీవా అధికారులు పట్టించు కోవడం లేదని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నోటీసు బోర్డును తొలగించారు

గతంలో ఇక్కడ ఉన్న సామూహిక మరుగుదొడ్లను సపంచాయతీ అధికారుల కూల్చి వేశారు. అనంతరం రాళ్ల పాతి, చుట్టూ కంచెవేసి, ఈ 'స్థలం పంచాయతీదే' అని నోటీసు పెట్టారు. అయితే కబ్జాదారులను ఆ బోర్డును పీకేశారు.

నోటీసులు జారీ చేస్తాం



బసవన్న గుడి వెనుక పంచాయతీ స్థలం ఆక్రమించుకున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆకరమణదారులకు నోటీసులు జారీ చేస్తాం. పంచాయతీ స్థలం అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేస్తాం.

\- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి

పత్తికొండలో టీ20 క్రికెట్ పోటీలు

పత్తికొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరిలో తిరుణాల సందర్భంగా సౌత్ ఇండియన్ లెవెల్-టీ20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సుంకన్న తెలిపారు. శనివారం గోడ పత్రికలను ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆవిష్కరించారు. కేఈ యూత్ పత్తికొండ ప్రీమియర్ లీగ్ సౌత్ ఇండియన్ లెవెల్ టీ-20 పేరిట పట్టణంలోని స్టేడియంలో ఈపోటీలు ఫిబ్రవరి 1నుంచి 18 వరకు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతి రూ 2,16,000లు, రెండో బహుమతి రూ 1,16,000లు, మూడో బహుమతి రూ51,116లు, మ్యాన్ ఆఫ్‌ద టోర్నమెంట్‌కు రూ10,116లు ఇస్తామన్నారు. వివరాలకు 9160114757, 9550341715 సెల్‌నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేద విద్యార్థుల ఫీజు చెల్లిస్తా

- ఎంపీ బస్తిపాటి నాగరాజు
- నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం


దేవనకొండలో భోజనం వడ్డిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు, ఆర్డీవో భరత్



ఆదోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మీనాక్షి నాయుడు, ఆలూరులో వీరభద్ర గౌడ్


ఆలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

దేవనకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేద విద్యార్థుల ఫీజులు తానే చెల్లిస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు అభివృద్ధి పథంలో దూసు కుపోతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 94పథకాలు అగిపోయాయన్నారు. నిర్వహణ లేక జల జీవన్ మిషన్ నిధులు 80 శాతం వెనక్కి వెళ్లాయని అన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రతి ఇంటికి కొళాయి ఏర్పాటు చేసి నీరందిస్తామన్నారు. టీడీపీ కన్వీనర్ విజజభాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, బడిగింజల రంగన్న, తహసీల్దార్ లోకేశ్వరయ్య, జనసేన ఇన్‌చార్జి వెంకప్ప, ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌శర్మ, నాయకులు రామారావునాయుడు, ఉచ్చీరప్ప, అధ్యాపకులు వీరగురుడు, కృష్ణమూర్తి, సీఐ వంశీనాథ్, తదితరులు పాల్గొన్నారు. మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని ఎంపికి ఏఐఎస్ఎఫ్ నాయకులు భాస్కర్, మధు, సురేంద్ర, రవితేజ, భరత్ వినతిపత్రం ఇచ్చారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం

పత్తికొండ: విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకమని, దురలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సూచించారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. డ్రగ్స్ బారినపడితే భవిష్యత్ అంధకారమవుతుందని, తల్లిదండ్రులకు కన్నీరు మిగులుతుందన్నారు. పెద్దహుల్తి-హోసూరు గ్రామాల మధ్య రూ. 2 వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్రాజెక్టుద్వారా 1,300 మంది ఉద్యోగాలు కల్పించనున్నామని తెలిపారు. త్వరలో ప్రారంభం కానున్న గోల్డ్‌మైన్స్‌లోకూ ఉద్యోగాలు కల్పిస్తామని ఐదేళ్లలో పత్తికొండను అభివృద్ధి చేస్తామన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను త్వరలో పత్తికొండలో ఏర్పాటుచేస్తామని, ఇప్పటికే ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం ప్లేట్లు, గ్లాసులు కొనేందుకు ఎమ్మెల్యే శ్యాంబాబు రూ.40వేలను ప్రిన్సిపాల్ నైమున్నీసాకు అందించారు. ఆర్డీవో భరత్‌నాయక్, సీఐ జయన్న, ఎంఈవో రమేష్, బాలురహైస్కూల్ హెచ్ఎం, టీడీపీ నాయకులు తిమ్మయ్యచౌదరి, పూర్వవిద్యార్థులు ఆలంకొండనబి, బత్తినలోక్‌నాథ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలి: ఎమ్మెల్యే

ఆలూరు: కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షి సూచించారు. శనివారం ఆలూరు ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రమాదేవి, కో ఆప్షన్ సభ్యులు బాష, వైసీపీ నాయకులు అరికెర వెంకటేశ్వరులు, భాస్కర్, శివ, వీరేశ్, వరుణ్, కొట్టాల రాజు, తిక్కస్వామి పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్: విద్య ప్రాముఖ్యతను గుర్తిస్తే రాణిస్తారని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో భోజన పథకాన్ని ప్రారంభిం చారు. ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత జనసేన ఇన్‌చార్జ్ మల్లప్ప పాల్గొ న్నారు. ప్రిన్సిపాల్ సంజన్న, టీడీపీ నాయకులు రామ స్వామి, గుడిసె శ్రీరాములు లక్ష్మీనారాయణ, తిమ్మప్ప అధ్యాపకులు గోవిందరాజులు, సూరిబాబు, వేదవతి పాల్గొన్నారు.

ఆలూరు: టీడీపీ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థుల ఆకలి తీర్చిందని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రమాదేవి, ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, ఎం ఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి, టీడీపీ నాయ కు లు రాంనాథ్ యాదవ్, సాలి సాహెబ్, నరసప్ప, హరిరెడ్డి, కొమ్ము రాజు, సురేంద్ర, రాము యాదవ్, రామకృష్ణ, వన్నూర్ వల్లి, మెకానిక్ వీరేష్, రామూర్తి పాల్గొన్నారు.

ఆస్పరి: విద్యార్థులు ఇష్టపడి చదవాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ సూచించారు. శనివారం స్థానిక ప్రభుత్వం జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పారంభించారు. కన్వీనర్ పరామరెడ్డి, గ్రామ సర్పంచ్ మూలింటి రాధమ్మ, ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహ, ఎస్ తిమ్మన్న, ఉచ్చరప్ప, సాలే సాహెబ్, రంగనాథ్, సతీష్ కుమార్, యుగంధర్, మహేష్ పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయినుల పాత్ర



ఉపాధ్యాయినులకు ఎస్టీయూ నాయకుల సన్మానం

ఆదోని అగ్రికల్చర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయినుల పాత్ర కీలకమని ఎస్టీయూ కౌన్సిలర్ మహదేవప్ప అన్నారు. పూలే జయంతి సందర్భంగా శనివారం ప్రాంతీయ కార్యాలయంలో కౌతాళం ఆదోని మండల శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు. సామాజిక రుగ్మతలు, బాల్య, వితంతు వివాహాలును అరికట్టాలని. బాలికా విద్యను ప్రోత్సహించడంలో సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నాగలక్ష్మి, అరుణజ్యోతి, భవాని, సుజాత, అనిలా, సారమ్మ, అంజనమ్మ, నవ్య కృష్ణ, మంజుల, భాగ్యలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, గోపాల్, రామాంజనేయులు, రామకృష్ణ, సుధాకర్ బాబు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

హొళగుంద, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణా అన్నారు. శనివారం డొక్కాసీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఐ బాల నరసింహులు, ఎమ్ఈవో జగన్నాధం, టీడీపీ నాయకులు తిప్పయ్య, ఎర్రిస్వామి పాల్గొన్నారు. జడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం నజీర్ అహ్మద్, టీడీపీ నాయకులు రాజా పొంపన్న గౌడ్, కూడురు ఈరప్ప ఆదాం, విజయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గడ్డి వామిని పరిశీలించిన సీఐ


హెబ్బటంలో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

హొళగుంద, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెబ్బటం గ్రామంలో శుక్రవారం దగ్ధమైన గడ్డివామని ఆలూరు సీఐ వెంకటచలపతి శనివారం పరిశీలించారు. గ్రామంలో గతంలో కూడా ప్రమాదాలు జరిగినట్లు తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును ఎస్ఐ బాలనర్సింహులును, గ్రామస్థులను సీఐ అడిగి తెలుసుకున్నారు.

లూయిస్ బ్రెయిలీకి ఘన నివాళి

ఆలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం ఎంఈవోలు కోమల దేవి, చిరంజీవి రెడ్డి బ్రెయిలీ సేవలను వివరించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విశ్రాంత ఉపాధ్యాయులు గోవిందప్ప, భవిత కేంద్ర ఉపాధ్యాయులు రామదాసు, అరుణ జ్యోతి పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిన ఆర్యవైశ్యులు

వెల్దుర్తి టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడ హైందవ శంఖారావానికి వెల్దుర్తికి చెందిన ఆర్యవైశ్యులు శనివారం తరలివెళ్లారు. యూత్ సెక్రటరీ అత్తులూరి కృష్ణ కిరణ్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. సుప్రియ వెంకటేశ్వర్లు, శేషు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అధైర్యపడొద్దు

మద్దికెర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అధైర్యపడకుండా ముందుకు సాగితే రాణించవచ్చని ఎంఈవో రంగస్వామి అన్నారు. శనివారం ఎంపీపీ పాఠశాల మెయిన్‌లో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ లిపిని కనుక్కొని మార్గదర్శకుడయ్యారని కొనియాడారు. హెచ్ఎం ఎం.విశ్వనాథ్, ఉపాధ్యాయులు రాజేశ్వరరెడ్డి, మాధవీలత పాల్గొన్నారు.

చెత్తను వేరు చేయండి

మద్దికెర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తడిచెత్త, పొడిచెత్తను వేరు చేయాలని సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ మాజీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, ఈవో శివకుమార్ సూచించారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సుధాకర్, సభ్యులు జంబునాథ్ రాయుడు, బాలచంద్ర, సిబ్బంది విజయ్, వలి తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం ప్రారంభం

వెల్దుర్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు బలరాంగౌడు ప్రారంభించారు. అంతకుముందు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ ఉదయం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ నాగభూషణం రెడ్డి, పారిశ్రామికవేత్త సాయి ప్రసాద్, ఎర్రబజారు, రామచంద్రుడు, పాల్గొన్నారు.

తాగు, సాగు నీరందించాలి

తుగ్గలి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి గ్రామానికి సాగు, తాగునీరు అందించాలని సీపీఎం మండల అధ్యక్షులు శ్రీరాములు, కొండారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సచివాలయంలో పంచాయతీ కార్య దర్శి నారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు.

అంధుల జీవితాల్లో వెలుగు నింపిన బ్రెయిలీ


మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంధుల జీవితల్లో బ్రెయిలీ వెలుగులు నిపారని డిప్యూటీ ఈవో వెంకట రమణారెడ్డి అన్నారు. శనివారం తిరుమల నగర్ భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. అందించారని కొనియాడారు. ఎంఈవో శ్రీనివాసులు, ఎంపీపీఎస్ హెచ్ఎం నిర్మలమ్మ విజయలక్ష్మి ప్రభుత్వ ఆసుపత్రి ఎర్లీ ఇంటర్వెన్షన్ పరమేష్, నిర్వహకులు శాంత కుమార్, మౌనిక, సంయుక్త పాల్గొన్నారు.

సంక్రాంతికి రండి

దేవనకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్లలో ఈ నెల 11న నిర్వహిచనున్న సంక్రాంతి సంబరాలకు రావాలని గ్రామస్తులు దత్తత పుత్రుడు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణను కోరారు. శనివారం విజయవా డలోని రవికృష్ణ నివాసంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఆటల పోటీలు ఉంటాయని, 11న వేడుకలు ఉంటా యన్నారు. సేట్రిస్ మేనేజరు నారాయణ, చింతమాను రవికుమార్, భవాని, ఫకూర్బి, లక్ష్మీదేవి ఉన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆకే రవికృష్ణ

కారు బీభత్సం..

వెల్దుర్తి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఓ కారు మూడు వాహనాలను కారు ఢీ కొని, వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... ఆదిత్య అనే వ్యక్తి హైదరాబాదు నుంచి బెంగళూరుకు స్వయంగా డ్రైవ్‌చేస్తూ కారులో బయలుదేరాడు. జాతీయ రహదారి-44 మార్గమధ్యలో అల్లుగుండు గ్రామ సమీపంలో కంకర లోడుతో వెళుతున్న డీసీఎం ను ఢీ కొట్టి, అదే వేగంతో అవతలి రోడ్డులో అనంతపురం నుంచి కర్నూలుకు వెళుతున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సును ఢీ కొట్టి, పక్క లేన్‌లో శబరి నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారును ఢీ కొట్టి డివైడర్ ఎక్కించాడు. ఆదిత్యకు గాయాలయ్యాయి. కారు మూడు వాహనాలను ఢీ కొట్టడంతో వాహనాలు దెబ్బ తిన్నాయి. హైవే పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించి, క్షతగ్రాతున్ని కర్నూలుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని వెల్దుర్తి సీఐ మధుసూదనరావు పరిశీలించారు. వెల్దుర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నుజ్జు నుజ్జు అయిన కారు

విద్యారంగంలో సమూల మార్పులు

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి
● ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రారంభం

ఎమ్మిగనూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక కష్టాలను అధిగమిస్తూ ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలురు, బాలికల కళాశాలల్లో ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేసి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తిరిగి జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇది గ్రామీణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రసాద్, విజయరమణి, హెచ్ఎంలో చిత్రావతి, కృష్ణమూర్తి, ఎంఈఓలు ఆంజనేయులు, మధుసూదన్ రాజు, హరి, రాజశేఖర్ రెడ్డి యల్లప్పశ్రీరామ్, టీడీపీ నాయకులు ముగతి ఈరన్న గౌడ్, కౌన్సిలర్ రామదాసు గౌడ్, జయన్న, ఇషాక్, అమాన్, కనికే నాగరాజు, బీజేపీ నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

మంత్రాలయం: విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బి.లక్ష్మన్న అన్నారు. శనివారం మంత్రాలయం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రాలయం సీఐ రామాంజులు, ఎంఈవో రాగన్న, ఎంపీడీవో శోభారాణి, హెచ్ఎం వీరేష్, టీడీపీ నాయకులు వరదరాజులు, అశోక్ రెడ్డి, విష్ణువర్దన్, రాఘవేంద్ర, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, మేకల నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

కోసిగి: విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మంత్రాలయం ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి భోం చేశారు. మధ్యాహ్న భోజనం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు వడ్డించాలని నిర్వాహకులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ, జనసేన, బీజేపీ మంత్రాలయం ఇన్చార్జిలు బి.లక్ష్మన్న, ఎన్.విష్ణువర్ధన్ రెడ్డి, టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, వక్రాణి వెంకటేశ్, జక్కనగేని వెంకటేశ్, ఈరన్న పాల్గొన్నారు.

కౌతాళం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని టీడీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకాన్ని కూటమి నాయకులు, కళాశాల ఆధ్యాపకులతో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ కౌతాళం టౌన్ అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్, నాయకులు సతీష్ నాయుడు, రామలింగ పాల్గొన్నారు.



మంత్రాలయంలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి, కౌతాళంలో..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు



ఎమ్మిగనూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఎస్ఐ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: యువతకు ఎలాంటి సందేశం ఇస్తారు?

జవాబు: ఈతరం యువత జలసాల పేరుతో జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా పిల్లలకు తల్లిదండ్రుల భయం ఉండాలి. జలసాలకు వెళ్లి ప్రమాదాలకు గురైతే వారి జీవితమే ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ దిశగా మేము కూడా యువతకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: మండలంలో అధికంగా బెల్టుషాపులు ఉన్నాయి కదా?

జవాబు: ఎమ్మిగనూరు మండలంలో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు దాదాపు 10మంది నిర్వాహకులపై కేసు నమోదు చేశాం.

ప్రశ్న: కొన్ని గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి?

జవాబు: వాస్తవానికి కర్ణాటక మద్యాన్ని నియంత్రించాం. ఎక్కడైనా కర్ణాటక మద్యం విక్రయిస్తే ప్రజలు మాకు సమాచారం అందించాలి. ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఇసుక, గరుసు రవాణాలకు అనుమతులు ఉన్నాయి?

జవాబు: మండలంలో ఎక్కడా కూడా ఇసుక రవాణాకు అనుమతులు లేవు. గరుసు కావాలనుకునే వారు తహసీల్దార్ లేదా మైనింగ్ అధికారులతో అనుమతులు తీసుకోవాలి.

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి భద్రత ఏర్పాటు చేశారు..?

జవాబు: మండలంలో ఉన్న సమస్యాత్మక గ్రామాల్లో నిత్యం పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఇప్పటికే కలుగొట్ల, కె.తిమ్మాపురం, దైవందిన్నె గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం.

గొర్రెలకు మేతగా కొత్తి మీర పంట

● పడిపోయిన ధర.. కట్ట రూ.5


కొత్తి మీరను మూగజీవాలకు మేతగా వదిలిన దృశ్యం

గోనెగండ్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్తిమీర ధర పడిపోయింది. దీంతో వ్యాపారులు కొత్తిమీరను కొనేందుకు ముందుకు రావడం లేదు. పంటను సాగు చేసిన రైతులు చేసేంది లేక పంట అదును దాటడంతో మూగజీవాలకు మేతగా వదులుతున్నారు. గోనెగండ్లలోని కబుల్, మాబు అనే రైతులు తాము సాగు చేసిన కొత్తిమీరను శనివారం మూగజీవాలకు మేతగా వదిలాడు. మండల వ్యాప్తంగా దాదాపు 500 ఎకరాల్లో కొత్తిమీరను సాగు చేశారు. కబుల్ అనే రైతు ఒక ఎకరంలో కొత్తిమీరకు రూ. 80వేలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేశాడు. అయితే ధర లేక పోవడంతో వ్యాపారులు రాలేదు. దీంతో కొత్తి మీర రైతులు గ్రామంలో గంపలో కొత్తిమీర కట్టలు పెట్టుకొని రూ. 5లకు ఒక కట్ట అమ్మకాలు జరుపుకుంటున్నారు. అయితే పంట సాగు చేసి 40 రోజులు ముగియడంతో ఇక చేసేది లేక మూగజీవాలకు వదిలివేస్తున్నారు. కొత్తి మీర రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

శ్రీమఠంలో స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ నిర్వహించారు. ధనుర్మాస శనివారం పంచమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.

హిందూ ధర్మం ఖండాంతర వ్యాప్తి చెందాలి

● పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు


హనుమాన్ చాలీసా పారాయణంలో
భక్తులకు అభివాదం తెలుపుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మం ఖండాంతర వ్యాప్తి చెందాలని మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. శనివారం అనంతపురంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఇందుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఠాధిపతికి హనుమాన్ చాలీసా పారాయణం ప్రచురణ సమితి, పావనసుత, యువజన సేవా ట్రస్టు ఘనంగా స్వాగతం పలి కారు. సనాతన హిందూ ధర్మం సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆంజనేయస్వామిని స్మరించుకోవడం వల్ల శారీరక బలం, మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న హంపీ మఠం పీఠాధిపతి విద్యానారాయణ భారతి స్వామిజీ, అలేశ్యాం స్వామీజి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో సురేంద్రాచార్, ప్రకాషాచార్, ఆనందతీర్థాచార్, జయతీర్థాచార్, గౌతమాచార్ పాల్గొన్నారు.

పార్లపల్లిలో ఘర్షణ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకున్న సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని ప్రజలు, రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పీరా, వెంకటరామిరెడ్డి గ్రామంలోని బజారులో మాట్లాడుతూ ఉండుగా ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఘర్షణలో పీరాకు గాయాలు కాగా స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రాలయం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన ఇన్చార్జి బి.లక్ష్మన్న అన్నారు. శనివారం కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన వేదిక పై డీటీఎఫ్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, రామన్న ఆధ్వర్యంలో డీటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఫైనుద్దీన్, రాగన్న, ప్రిన్సిపాల్ రమేష్, హంపయ్య, సీఐ రామాంజులు, టీడీపీ నాయకులు వరదరాజు, అశోక్ రెడ్డి, విష్ణువర్దన్, శివ, మేకల వెంకటేశ్, ఎస్ఐ పరమేష్ నాయక్; బీవీ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంత్రాలయం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ఉన్నత చదువుల వరకు క్రమశిక్షణ, ఏకాగ్రత, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రిటైర్డు డిప్యూటీ డీఈవో ఈరన్న, శ్రీమఠం ఈఈ సురేష్ కోనాపూర్ అన్నారు. శనివారం శ్రీమఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరిమళ విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, హనుమేష్, వానిశ్రీ, నాగలక్ష్మి, నంద, పీఆర్వో మధుసూదన్‌రావు, పీఈటీ వెంకటేశ్, అంజి పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్నులు చెల్లించాలి

గోనెగండ్ల, జనవరి 4(ఆంధ్ర్యజ్యోతి): గ్రామంలో వంద శాతం ఇంటి పన్ను, నీటి పన్ను వసూలు చేయాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ అన్నారు. శనివారం గోనెగండ్లలోని ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్తను గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ శుభ్రం చేయించారు. అనంతరం దోమలు, ఈగలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం లో పంచాయతీ సిబ్బంది సచివాలయ ఉద్యోగులు ఇంటి పన్ను, నీటి పన్నులను జనవరి నుంచి మార్చి లోపు వందశాతం పూర్తి చేయాల న్నారు. పన్నుల వసూళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

కోసిగి అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దాం

● రూ.5 లక్షలతో తాగునీటి కొళాయిలు ప్రారంభించిన రాఘవేంద్రరెడ్డి


రామక్కమ్మవ్వ కాలనీలో పర్యటిస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కోసిగి గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని టీడీపీ మంత్రాలయం ఇన్చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలోని 9వ వార్డు రామక్కమ్మవ్వ కాలనీలో సర్పంచ్ అయ్యమ్మ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన 22 తాగునీటి కొళాయిలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వర్ రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చిన్నతాయన్న, మాణిక్యరాజు, రామకృష్ణ, వెంకటేశ్, నర్సారెడ్డి, జ్ఞానేష్, ఈరన్న, రాజేష్, పంచాయతీ సిబ్బంది వాటర్‌మ్యాన్‌లు శ్రీనివాసులు, కుంటి ఈరన్న, రమేష్ పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

నందవరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న చేపట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశప్ప కోరారు. 3శనివారం మండలంలోని కనకవీడు గ్రామ హైస్కూల్‌లో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వ జీవో 117ను సంపూర్ణంగా రద్దు చేయాలన్నారు. ఉపాధ్యాయుల అన్ని రకాల ప్రమోషన్‌లు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులపై మోపుతున్న యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో గౌరమ్మ, నాగరాజు, దౌవలేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చూపుతున్న సవితి ప్రేమను నిరసిస్తూ ఈనెల 11న విజయవాడలోని అలంకర్ సెంటర్‌లో డీటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వి.జి వెంకటరాముడు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాలలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 117వ జీవోను రద్దు చేసి విద్యారంగాన్ని కాపాడాలని, 223వ జీవోను రద్దు చేసి అర్హత కలిగిన పాఠశాల సహాయకులకు, జూనియర్ లెక్చర్లు, డైట్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. పాఠశాల స్థాయిలో తెలుగు,ఆంగ్ల మాధ్యమాలను సమాంతరంగా అమలు చేయాలని, వివక్షత లేకుండాఅన్ని ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించి మధ్యాంతర భృతి 30శాతం ప్రకటించాలని, అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భవితా మానసిక దివ్యాంగుల పాఠశాలలో నిర్వాహకులు బాబు, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లూయిస్‌బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈవోలు ఆంజనేయులు, మధుసుదన్‌రాజు, సామాజిక వేత్త మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు, బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలలిత, డీఈఎఫ్ నాయకులు నాగరాజు, బ్లైండ్ అసోసియేషన్ అధ్యక్షులు మారెప్పలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

పెన్షనర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో శనివారం పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈరన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో సంఘం 2025 క్యాలెండర్, డైరీని విడుదల చేశారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ మేనేజర్ రవికళాధర్ శర్మ క్యాలెండర్, డైరీని విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు అబ్దుల్‌ఖరీం, సభ్యులు సుందరీబాయి, హనుమంతురావు పాల్గొన్నారు.

● మహాయోగి లక్ష్మమ్మ డిగ్రీ కళాశాలలో కామర్స్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు తయారు చేసిన 2025 క్యాలెండర్‌ను కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.మహబూబ్‌బాషా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఇన్నోవేటివ్ కార్యక్రమాలు మరెన్నో చేయాలని, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకులు క్రాంతికుమార్, డాక్టర్ పాల్‌దేవదానం, నాగప్రదీప్‌కుమార్, మనోరంజ న్, సూపరిటెండెంట్ మద్దిలేటి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లలో లోటు పాట్లు ఉండకూడదు: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి జాతరకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటు పాట్లు ఉండకూడదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, పోలీసు, విద్యుత్, తాగునీటి, రహదారులు, దేవాదాయ అధికారులతో పాటు నీటకంఠేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లును డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐలు శ్రీనివాసులు, బీవీ మధుసూదన్‌లతో చర్చించారు. అలాగే జాతర సమయంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. అలాగే తాగునీటి సమస్య తలెత్తకుండా, రహదారులకు మరమ్మతులపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. జాతర సమయానికి పట్టణానికి వచ్చే భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తామని ఆలయ నిర్వాహకులకు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టీపీలో రాజేష్, ప్రసన్న ఆంజనేయులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● **ప్లాటినం జూబ్లీ వేడుకలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం:** ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్లాటీనం జూబ్లీ వేడుకలు ఈనెల 12న జరగనున్నాయి. శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని వేడుకలకు ఆహ్వానించారు. ఆహ్వాన కమిటీ సభ్యులు శివకుమార్, ప్రాకాష్‌జైన్, మల్లికార్జున, షఫీఉల్లా, వెంకటేష్, లక్ష్మీనారాయణ, కామలెగణేష్, ఈరన్నగౌడు, జబీర్‌బాషా లు ఎమ్మెల్యేను కలిసి వేడుకలకు ఆహ్వానించారు.


అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

● **ఎమ్మెల్యేను కలిసిన రెడ్ల సంఘం నాయకులు:** ఎమ్మిగనూరుకు చెందిన రెడ్ల సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలిశారు. ఈ మేరకు పట్టణ శివార్లలో ఉన్న రెడ్ల సమస్మశాన వాటిక కాంపౌండ్ వాలు ఎత్తు పెంచేవిషయం, స్మశాన వాటికలో బర్నింగ్‌మిషన్ ఏర్పాటుతో పాటు ఇతర విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోసంఘం నాయకులు లింగారెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డిలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న బండేగురుస్వామి

నందవరం, జనవరి 4(ఆంధ్ర్యజ్యోతి): మండలంలోని పూలచింత గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ. 70 వేలు విరాళంగా టీడీపీ నాయకులు బండేగురుస్వామి శనివారం అందజేశారు. సర్పంచ్ అక్కామాంబదేవి, బండేగురుస్వామి మాట్లాడుతూ ఆలయాలు, విగ్రహాల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాముడు, కృష్ణమూర్తి, రవి, నరసింహులు, బసవరాజుగౌడు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

కోసిగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో కోసిగి విద్యార్థికి మొదటి బహుమతి వచ్చింది. శనివారం కర్నూలులో జిల్లాస్థాయిలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. కోసిగి మోడల్ స్కూల్ విద్యార్థి ప్రణయ్ కుమార్ రెడ్డి ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్స్ అంశంపై ప్రదర్శన ఇచ్చారు. ఇది జిల్లాస్థాయిలో మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఉపాధ్యాయులు మోహన్‌బాబు, సాయికుమారి అభినందించారు.

కౌతాళం మండలంలో..

కౌతాళం,(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో కౌతాళం మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. కామవరం ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యా ర్థులు సంజన, మీనాక్షిలు, మదిరె పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో 2వ, 3వ స్థానంలో సాధించారు. విద్యార్థులను ఎంఈవో- 2 శోభారాణి, ఉపాధ్యాయులు రాం మోహన్, దేవేంద్రబాబు అభినందించారు.

మైనార్టీల సంక్షేమం కోసం కృషి

గోనెగండ్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మైనార్టీ అభివృద్ధి, సంక్షేమం కోసం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నిరంతరం పాటు పడుతుందని ఆ సంఘం రాష్ట్ర సమితి మీడియా కోఆర్డినేటర్ అహ్మద్‌హుసేన్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మైనార్టీలకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన పలు సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన ఎంహెచ్‌పీఎస్ క్యాలెండర్‌ను వేర్వేరుగా గోనెగండ్ల సీఐ గంగాధర్, తహసీల్దార్ కుమారస్వామి, మాజీ సర్పంచ్ రహంతుల్లా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, కుమార్, మన్సూర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్

కౌతాళం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామసభలతో రైతులు తమ భూసమస్యలను పరిష్కరించుకోవచ్చని కౌతాళం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని చూడి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉలిగయ్య, మండల సర్వేయర్ బసవరాజు స్వామి, వీఆర్వో నరసింహులు, కూటమి ప్రభుత్వ నాయకులు వడ్డే ఈరన్న, శ్రీధర్, సురేష్, రైతులు ఉన్నారు.

మంత్రాలయం: రైతులు ఫిర్యాదు చేసిన ప్రతి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని మంత్రాలయం డిప్యూటీ తహసీల్దార్ జీకే గురు రాజరావు అన్నారు. శనివారం సింగరాజనహల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమావేశంలో వీఆర్వోలు ఆనంద్, ప్రభాకర్, సర్వేయర్ చిట్టెమ్మ, సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: గత ప్రభుత్వంలోని రిసర్వేలో జరిగిన భూ సమస్యలను, తప్పులను సరిదిద్దడం కోసమే కూటమి ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని కోసిగి తహసీల్దార్ నిత్యానందరాజు అన్నారు. మండల పరిధిలోని పల్లెపాడు గ్రామంలో శనివారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ ఎల్లెల్సీ చైర్మన్ పల్లెపాడు రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ రాజేంద్రనాయుడు, మండల సర్వేయర్, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదోని రహదారిలో రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు వాహనాల తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా 32వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు మద్యం తాగి వాహనాన్ని నడిపినా, రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే ఉపేక్షించేదిలేదన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.